Follow: @ANNTELUGU

17-10-2025

# మహా పత్రిక

ANN తెలుగు

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 312 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## మంత్రి కొండా సురేఖ..
# మరో దుమారం
### పరిష్కారంపై అధిష్ఠానం నజర్

డిప్యూటీ సీఎం భట్టి, ఇన్ ఛార్జి మీనాక్షితో సురేఖ భేటీ

హైకమాండ్ కు అన్నీ చెప్పా.. వారి ఆదేశాల ప్రకారం వెళ్తా కొండా సురేఖ

**హైదరాబాద్, మహా :**

కాంగ్రెస్ ప్రభుత్వంపై కొండా సురేఖ కుమార్తె తీవ్ర ఆరోపణలు చేసిన వేళ పార్టీ అధిష్ఠానం ఈ సమస్యపై దృష్టి సారించింది. తొలుత ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె సుష్మిత ప్రజా భవన్‌లో భేటీ అయ్యారు. బుధవారం రాత్రి నుంచి జరిగిన పరిణామాలు వివరించారు. తర్వాత ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్‌ను సురేఖ, సుష్మిత కలిశారు.


మిగతా 2లో

టాప్ న్యూస్



### జూబ్లీహిల్స్‌లో సమంత, తమన్నా, రకుల్
- ఫేక్ ఓటర్ ఐడీల వైరల్
- ఎన్నికల సంఘం సీరియస్

02



### గుజరాత్‌లో రాజకీయ సంక్షోభం
- సీఎం మినహా మంత్రులంతా రాజీనామా
- నేడు కొలువుదీరనున్న నూతన మంత్రివర్గం

02



### జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సీపీఎం మద్దతు కోరిన కాంగ్రెస్
- జాన్ వెస్లీతో పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ భేటీ

02



## స్థానిక ఎన్నికల్లో ఇద్దరు పిల్లల
# నిబంధన తొలగింపు

### కేబినెట్ సమావేశంలో సంచలన నిర్ణయం
### బీసీ రిజర్వేషన్లపై 23న నిర్ణయం

- సుప్రీం తీర్పు.. అభ్యంతరాలు అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశం
- మెట్రో కొనుగోలు.. పర్యవసానాలపై అధ్యయానికి సీఎస్ సారథ్యంలో కమిటీ
- డిసెంబర్ 1నుండి 9వరకు ప్రజాపాలన వారోత్సవాలు
- ధాన్యం కొనుగోళ్ళకు ప్రత్యేక కార్యాచరణ.. మరో 15లక్షల టన్నులు కొనాలని కేంద్రానికి విజ్ఞప్తి
- కేబినెట్ నిర్ణయాలు.. వెల్లడించిన మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, మహా :**

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లల నిబంధన తొలగించాలని రాష్ట్ర కేబినెట్ తీర్మానం చేసింది. స్థానిక ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన ఉండటంతో చాలా చోట్ల ఆశావహులు వెనక్కు తగ్గారు. బీసీ సంఘాల నుండి నిబంధన సడలింపు డిమాండ్ ఉంది. ఈ క్రమంలో ఈ నిర్ణయంపై పునరాలోచన చేసి, మంత్రుల అభిప్రాయం మేరకు ఈ నిబంధన తొలగిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో గురువారం మంత్రిమండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై కేబినెట్‌తో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించారు. కేబినెట్‌కి సంబంధించిన విషయాలను మీడియాకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. బీసీ రిజర్వేషన్లపై 23వ తేదీన జరిగే కేబినెట్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

**ఇవీ కేబినెట్ నిర్ణయాలు**

1. ఈ వానాకాలంలో 1.48 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుంది.

మిగతా 2లో

## కొండా సురేఖ గైర్హాజరు

02

# 50% పరిధి దాటొద్దు

### తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో చుక్కెదురు

స్పెషల్ లీవ్ పిటిషన్ కొట్టేసిన ధర్మాసనం

హైకోర్టులోనే తేల్చుకోండి.. పాత పద్ధతిలోనే ఎన్నికలకు వెళ్ళండి



**ఢిల్లీ, మహా :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్మయాన్ని సుప్రీంకోర్టు తిరస్కరించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి ఊహించని షాక్ తగిలింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు ఉద్దేశించిన జీవో నంబర్ 9 పై హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నో చెప్పింది. ప్రస్తుతం పాత పద్ధతిలోనే ఎన్నికలకు వెళ్లాలని సూచించింది. ఈ వ్యవహారంపై ఇప్పటికే హైకోర్టులో విచారణ కొనసాగుతున్నందున అవసరమైతే 50 శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లాలని తెలంగాణ ప్రభుత్వాన్ని దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది.

మిగతా 2లో

### వేర్ హౌస్‌లలో అవినీతి

వైరా తరహాలో రాష్ట్రవ్యాప్తంగా అక్రమాలు

రైస్ మాఫియాతో సర్కారుకు షాకులు

వివరాలు 2లో



02

## బీసీ బంద్‌కు కాంగ్రెస్ మద్దతు

### గాంధీభవన్‌కు బీసీ సంఘాల జేఏసీ

రిజర్వేషన్లు సాధించేవరకు పోరాటం ఆగదు.. బీసీలంటే భయపడే స్థాయికి తెస్తాం

18న జరిగే రాష్ట్ర బంద్ సెగ ఢిల్లీకి తాకేలా చేద్దాం - ఆర్ కృష్ణయ్య

## మజ్లిస్ కనుసన్నల్లో
# బీఆర్ఎస్, కాంగ్రెస్

### జూబ్లీహిల్స్‌లో ఎంఐఎం ఎందుకు పోటీ చేయదు

దారుస్సలాం నిర్ణయించిన అభ్యర్థి నవీన్ యాదవ్

ఎన్నికల ప్రచారంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ పార్టీకి ఓటేస్తే మోరీలో వేసినట్టేనని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. గురువారం జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని బోరబండ డివిజన్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మజ్లిస్ కనుసన్నల్లో పని చేస్తున్నాయని అన్నారు. మజ్లిస్ పార్టీకి అభివృద్ధి అవసరం లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏం మొహం పెట్టుకొని ఓట్లు అడుగుతోందని ప్రశ్నించారు. హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని అన్నారు.

మిగతా 2లో





### శ్రీశైల మల్లన్న సేవలో ప్రధాని మోదీ

ఏపీ సర్కారుపై ప్రశంసలు

అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్

వివరాలు 2లో

SRI GOLD
TRUSTED GOLD BUYERS

**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,29,440 |
| 22 క్యారెట్ | 1,18,650 |
| సిల్వర్ (కేజీ) | 1,90,000 |

**ఈరోజు గుడ్డు ధరలు**


| | 1 పీస్ ₹ | ట్రే ₹ |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 5 | 150 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 5 | 150 |
| రిటైల్ గుడ్డు ధర | 5.3 | 159 |

## సోషల్ మీడియా ఛానళ్లకు హైదరాబాద్
# సీపీ సజ్జనార్ వార్నింగ్


సోషల్ మీడియాలో ఫేమస్ అయ్యేందుకు చిన్నారులను బలిపెట్టవద్దని వ్యాఖ్య

పిల్లలతో అనుచిత కంటెంట్ చేయించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిక

లైక్స్, వ్యూస్ మాయలో పడి విలువలను మర్చిపోతే ఎలా?



03



# స్థానిక ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన తొలగింపు

(మొదటిపేజీ తరువాయి)

దేశంలోనే ఇది రికార్డు స్థాయి ఉత్పత్తి. ఇందులో రాష్ట్రంలో 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని పౌరసరఫరాల విభాగం అంచనా వేసింది.

2 కేంద్ర ప్రభుత్వం 50 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణకు అంగీకరించింది.. మరో 15 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని మంత్రి వర్గం నిర్ణయించింది.

3. వానకాలం సీజన్లో పండించిన ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ, పౌర సరఫరాల శాఖ, రవాణా శాఖ సమన్వయంతో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించింది.

4 ధాన్యానికి చెల్లించే మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు ఇచ్చే రూ.500 బోనస్ రైతుల ఖాతాల్లో వెంట వెంటనే జమ చేయాలని నిర్ణయం తీసుకుంది.

5. కలెక్టర్లు, అదనపుకలెక్టర్లు కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలని.. ప్రతి కొనుగోలు కేంద్రం పర్యవేక్షణ, సమన్వయానికి ఒక్కో అధికారికి ప్రత్యేక బాధ్యతలు అప్పగించాలని మంత్రివర్గం నిర్ణయించింది.

6. రాష్ట్రంలో కొత్తగా మూడు (3) అగ్రికల్చర్ కాలేజీల ఏర్పాటు కు రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. హుజూర్ నగర్, కొడంగల్, నిజామాబాద్ లో అగ్రికల్చర్ కాలేజీల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది.

7. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లు పూర్తయిన సందర్భంగా ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలను నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. డిసెంబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తుంది. ఉత్సవాల నిర్వహణ.. సంబంధిత ఏర్పాట్లపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం.

8. ఇద్దరు పిల్లలకు మించి సంతానమున్న వారు స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులనే నిబంధనను మంత్రివర్గం పునరాలోచన చేసింది. రాష్ట్రంలో జనాభా నియంత్రణ కట్టుదిట్టంగా అమలవుతున్న తరుణంలో ఈ గరిష్ఠ నిబంధనను అమలు చేయాల్సిన అవసరం లేదనే అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. ఈ నిబంధనను ఎత్తివేసేందుకు కేబినెట్ సూచనప్రాయంగా అంగీకరించింది.

9. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడులో ఏన్కూర్ మార్కెట్ యార్డ్ కు పది ఎకరాలు కేటాయిస్తూ కేబినెట్ తీర్మానం చేసింది.

10. నల్సార్ న్యాయ విశ్వ విద్యాలయానికి ఇప్పుడున్న చోటనే అదనంగా 7 ఎకరాల భూమిని కేటాయించే ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

11. నల్సార్ యూనివర్సిటీ అడ్మిషన్లలో ఇప్పుడు తెలంగాణ స్థానికులకు కేటాయించిన 25 శాతం సీట్ల కోటాను 50 శాతం పెంచాలని కేబినెట్ తీర్మానం చేసింది.

12. హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. మెట్రో 2A, 2B విస్తరణకు అడ్డంకిగా మారిన మొదటి దశను పీపీపీ మోడ్లో నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునే విషయంపై సుదీర్ఘంగా చర్చించింది. మెట్రో రైలును ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునే విషయంలో సాధ్యాసాధ్యాలు, అందులో ముడిపడి ఉన్న అంశాలన్నింటినీ లోతుగా అధ్యయనం చేసేందుకు ఉన్నత అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సీఎస్ ఛైర్మన్ గా, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, ఎంఏయూడీ కార్యదర్శి, లా సెక్రెటరీ, మెట్రో రైలు ఎండీ, అర్బన్ ట్రాన్స్పోర్ట్ అడ్వయిజర్ అధికారుల కమిటీలో సభ్యులుగా ఉంటారు. అధికారుల కమిటీ తమ రిపోర్టును కేబినేట్ సబ్ కమిటీకి అందిస్తుంది. కేబినేట్ సబ్ కమిటీ సిఫారసుల ఆధారంగా మెట్రోను ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునే విషయంలో తుది నిర్ణయం తీసుకోవాలని మంత్రివర్గం తీర్మానించింది.

13. రాష్ట్రంలో హ్యామ్ మోడ్లో మొదటి దశలో 5,566 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. జాతీయ రహదారులు, జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలు, పర్యాటక ప్రాంతాలు, ఇతర రాష్ట్రాలతో అనుసంధానమయ్యే రహదారులకు సంబంధించి అభివృద్ధి, విస్తరణ పనులు చేపడుతాం.

14. ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్ పేట ఓఆర్ఆర్, ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీ ఫాం రోడ్ వరకు నిర్మించే ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి సంబంధించి రక్షణ శాఖ భూములు వినియోగించుకుంటున్నందున వారికి ప్రత్యామ్నాయంగా 435.08 ఎకరాల భూములను అప్పగిస్తూ క్యాబినెట్ తీర్మానం చేసింది.

15. కృష్ణావికారాబాద్ బ్రాడ్గేజ్ రైలు మార్గం నిర్మాణానికి సంబంధించి 845 హెక్టార్ల భూ సేకరణకు అయ్యే రూ.438 కోట్ల వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు అంగీకరిస్తూ రాష్ట్ర క్యాబినెట్ తీర్మానం చేసింది.

16. మన్ననూర్శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి మొత్తం వ్యయంలో మూడో వంతు రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు అంగీకరిస్తూ క్యాబినెట్ తీర్మానం చేసింది.

# 50% పరిధి దాటొద్దు

(మొదటిపేజీ తరువాయి)

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ జీవో నంబర్ 9ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. ఈ జీవోపై కొందరు వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించగా, రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని మించి ఉన్నాయని అలాగే సుప్రీంకోర్టు నిర్దేశించిన 'ట్రిపుల్ టెస్ట్' (వెనుకబాటుతనం, జనాభా వివరాలు, 50 శాతం పరిమితి) ప్రమాణాలను పాటించలేదనే కారణంతో హైకోర్టు దీనిపై స్టే విధించింది. హైకోర్టు స్టే కారణంగా రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ జీవో నంబర్ 9 ఆధారంగా స్థానిక ఎన్నికలకు అనుమతి ఇవ్వాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్ పీ) దాఖలు చేసింది.

**50శాతం పరిమితికి లోబడే ఎన్నికలకు వెళ్లాలి**

రాష్ట్ర ప్రభుత్వం తరపున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ గురువారం వాదనలు వినిపించారు. ఈ అంశంపై తక్షణమే జోక్యం చేసుకోవాలని న్యాయస్థానాన్ని కోరారు. రిజర్వేషన్లు 50శాతం మించొద్దనే అభిప్రాయం సరికాదని కోర్టుకు వివరించారు. ఇందిరా సహానీ కేసులోనూ 50 శాతం పరమితి దాటొచ్చని ఉందని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా జరగని విధంగా తెలంగాణలో కులగణన సర్వే జరిగిందని అన్నారు. ప్రభుత్వం ఇంటింటి సర్వే చేసి లెక్క తేల్చిందని అభిషేక్ సింఘ్వీ న్యాయస్థానానికి వివరించారు. రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీలో అన్ని పార్టీలు ఏకాభిప్రాయం వ్యక్తం చేశాయని.. 3 నెలలు దాటినా బిల్లుపై గవర్నర్ నిర్ణయం తీసుకోలేదని వాదించారు. 3 నెలల్లో నిర్ణయం తీసుకోకపోతే బిల్లు ఆమోదం పొందినట్టేనని సుప్రీం చెప్పిందని.. సుప్రీం తీర్పు ప్రకారం బిల్లు చట్టంగా మారినట్టేనని వాదనలు బలంగా వినిపించారు. వాదనలను విన్న జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. రిజర్వేషన్ల విషయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పునరుద్ఘాటిస్తూ 50 శాతం రిజర్వేషన్ల పరిమితికి లోబడి మాత్రమే ఎన్నికలకు వెళ్లాలని సర్వోన్నత న్యాయస్థానం తెలంగాణ ప్రభుత్వానికి స్పష్టం చేసింది. ఇప్పటికే ఈ వ్యవహారంపై హైకోర్టులో విచారణ జరుగుతున్న విషయాన్ని గుర్తు చేసింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలంటూ ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను ధర్మాసనం కొట్టివేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో తాము జోక్యం చేసుకోలేమని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.

## మజ్లిస్ కనుసన్నల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్

**జూబ్లీహిల్స్‌లో ఎంఐఎం ఎందుకు పోటీ చేయదు**

దారుస్సలాం నిర్ణయించిన అభ్యర్థి నవీన్ యాదవ్

ఎన్నికల ప్రచారంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ పార్టీ నేతలు విపరీతంగా దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. రెండేళ్ళుగా వీధిలైట్లు కూడా వేయలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. దేశ వ్యాప్తంగా పోటీ చేసే ఎంఐఎం జూబ్లీహిల్స్ లో ఎందుకు పోటీ చేయడంలేదో చెప్పాలన్నారు. దారుస్సలాం నిర్ణయించిన అభ్యర్థి కే కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చిందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఎందుకు ఓటు వేయాలని, ఆ పార్టీ ఎక్కడ ఉందని ప్రశ్నించారు. ఆ పార్టీ నుంచి ఇప్పటికే పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరారని ఆరోపించారు. ఈరెండూ ఫిరాయింపులను ప్రోత్సాహించే పార్టీలేనని, కుటుంబాలు, పార్టీలో ఉండే కుటుంబాల కోసమే పనిచేస్తాయని విమర్శించారు. ఎంఐఎం, బీఆర్ఎస్, కాంగ్రెస్ డీఎన్ఏ ఒక్కటేనని అన్నారు. బీఆర్ఎస్ కు ఓటేస్తే మోరీలో చేసినట్లేనని, ఒక్క ఎంపీ సీటు కూడా ఆ పార్టీ గెలవలేదని అన్నారు. బీజేపీని గెలిపించుకునేందుకు వచ్చే నెల 11 వరకు అందరూ కష్టపడి పనిచేయాలని కోరారు. కార్యకర్తల కోసం పూర్తి సమయంఇచ్చి పనిచేస్తున్న దీపక్ రెడ్డి ని గెలిపించుకోవాలని కోరారు. ఇందుకోసం ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని సూచించారు. సభలు సమావేశాలు నిర్వహించడమే కాదని, జూబ్లీహిల్స్ ను పరిరరక్షించుకోవాలని అన్నారు. స్థానికంగా ఉన్న కార్యకర్తలకు సాయం చేసేందుకే మేం ఇక్కడికి వస్తున్నామని అన్నారు. ఇక్కడ ధర్మం, న్యాయం, ప్రజలు గెలవాలని పని చేయాలని సూచించారు. ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లు పూర్తి సమయం ఇక్కడే ఉంటారన్నారు...

# బీసీ బంద్‌కు కాంగ్రెస్ మద్దతు

**గాంధీభవన్‌కు బీసీ సంఘాల జేఏసీ**

**రిజర్వేషన్లు సాధించేవరకు పోరాటం ఆగదు.. బీసీలంటే భయపడే స్థాయికి తెస్తాం**

**18న జరిగే రాష్ట్ర బంద్ సెగ ఢిల్లీకి తాకేలా చేద్దాం - ఆర్ కృష్ణయ్య**



హైదరాబాద్, మహా

బీసీలంటే అందరికీ చిన్నచూపు, అందుకే బీసీలంటే భయపడే స్థాయికి తెస్తామని బీసీ జేఏసీ అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్య అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం గాంధీభవన్ వద్ద మీడియాతో మాట్లాడారు. అంతకుముందు పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ను కలవగా, బంద్ కు సంపూర్ణంగా మద్దతు ప్రకటించారు. బీసీ రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వ పోరాటం, ప్రయత్నాలు ఆగవని హామీనిచ్చారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ చైర్మన్, ఎంపీ ఆర్. కృష్ణయ్య బీసీలకు కోర్టులు అన్యాయం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఈ నెల 18న తెలంగాణ బంద్‌ను పెద్ద ఎత్తున నిర్వహిస్తామని తెలిపారు. బంద్‌లో అందరూ శాంతి యుతంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ బంద్‌లో ఒక్క మెడికల్ షాపులు తప్ప అన్నీ మూసేయాలని వ్యాపారులను రిక్వెస్ట్ చేశారు. ఆర్టీసీ బస్సులు సైతం తిరగొద్దు.. ప్రజలు ఆవేశంగా ఉన్నారు.. బస్సులు తిరిగితే తగులపెట్టే ప్రమాదం కూడా ఉందని ఆర్. కృష్ణయ్య అన్నారు. ఇలాంటి బంద్ చరిత్రలో ఎప్పుడు జరగలేదని, భవిష్యత్‌లో కూడా జరగని అన్నారు. బీసీలకు న్యాయం జరిగే వరకు ఈ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. అలాగే టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వడానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఈ నెల 18న జేఏసీ తలపెట్టిన బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. బంద్‌లో కాంగ్రెస్ నాయకులందరూ పాల్గొంటారని వెల్లడించారు.

## జూబ్లీహిల్స్ లో సమంత, తమన్నా, రకుల్

**ఫేక్ ఓటర్ ఐడీల వైరల్**

ఎన్నికల సంఘం సీరియస్

హైదరాబాద్, అక్టోబర్ 16: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో టాలీవుడ్ హీరోయిన్లు సమంత, తమన్నా, రకుల్ ప్రీత్ సింగ్ ఫేక్ ఓటర్ ఐడి లిస్టు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఓటర్ల జాబితాలో వీరి లిస్ట్ కనబడటంతో అందరూ ఆశ్చర్యానికి గురవుతున్నారు. అయితే దురుద్దేశంతో కొందరు ఈ ఫేక్ ఓటర్ ఐడీలు క్రియేట్ చేసి సోషల్ మీడియాలో ప్రచారానికి పెట్టినట్లు తెలుస్తోంది. వేరే ఓటర్ల ఎపిక్ నంబర్ తో హీరోయిన్ల ఫోటోలు పెట్టి ఓటర్ ఐడీ కార్డులు తయారు చేసినట్లు తెలుస్తోంది. ఫేక్ ఓటర్ ఐడీల ప్రచారంపై హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారులు సీరియస్ అయ్యారు. దీంతో రంగంలోకి దిగిన అధికారులు.. ఎక్కడ వీటిని ఫ్యాబ్రికేట్ చేశారు? ఎవరు ప్రచారం చేశారు? అన్న అంశాలపై ఎన్నికల సంఘం విచారణ చేపట్టింది. సోషల్ మీడియాలో ఫోటోలు వైరల్ చేయడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదయింది.

# మంత్రి కొండా సురేఖ మరో దుమారం

**పరిష్కారంపై అధిష్ఠానం నజర్.. డిప్యూటీ సీఎం భట్టి, ఇన్ ఛార్జి మీనాక్షితో సురేఖ భేటీ**

**హైకమాండ్ కు అన్నీ చెప్పా.. వారి ఆదేశాల ప్రకారం వెళ్తా కొండా సురేఖ**

(మొదటిపేజీ తరువాయి)

ఈ అంశంపై మీడియాతో మాట్లాడవద్దని ఇంతటితో ముగించాలని సూచించారు. అనంతరం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తోనూ మంత్రి సురేఖ, ఆమె కుమార్తె భేటీ అయ్యారు. తాజా పరిణామాలపై మంత్రి కొండా సురేఖ ఆమె కుమార్తె సుస్మిత చర్చించారు. గత కొన్ని రోజులుగా తనకు సంబంధించి చోటు చేసుకుంటున్న పరిణామాలను వివరించారు.

**హైకమాండ్ ఆదేశాల మేరకు ముందుకువెళ్తా...**

భేటీ అనంతరం కొండా సురేఖ మీడియాతో మాట్లాడారు. ఈ వివాదంపై స్పందించిన కొండా సుస్మిత తమతో కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలు మాట్లాడారని తెలిపారు. పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. మిగిలిన విషయాలు వారే చూసుకుంటారని భరోసాతో వెళ్తున్నానని మంత్రి సురేఖ తెలిపారు. గత కొన్ని రోజులుగా తనను, తన కుటుంబాన్ని టార్గెట్ చేసుకుని ఇబ్బంది పెడుతున్నారని నేతల వద్ద ప్రస్తావించినట్టు తెలుస్తోంది. డెక్కన్ సిమెంట్ యాజమాన్యం వ్యవహారంలో జరిగిన పరిణామాలు, వారితో జరిగిన చర్చలు, ఆ సంస్థ అక్రమాలు తదితర విషయాలన్నీ వివరించినట్లు సమాచారం. తాజా పరిణామాలపై మీనాక్షి నటరాజన్, మహేశ్‌కుమార్‌గౌడ్‌తో చర్చించాను. నా ఆలోచనలు, ఇబ్బందులను వారికి వివరించాను. నా సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. నా విషయాలు సెటిల్ చేస్తామని పార్టీ పెద్దలు చెప్పారు. మిగిలిన విషయాలు వారే చూసుకుంటారనే భరోసాతో వెళ్తున్నా. ఏది నిర్ణయం తీసుకున్నా కూడా వారు ఇచ్చిన ఆదేశాల మేరకు ముందుకు పోతానని తెలియజేస్తున్నాను" అని సురేఖ తెలిపారు.



## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సీపీఎం మద్దతు కోరిన కాంగ్రెస్

**జాన్ వెస్లీతో పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ భేటీ**

**హైదరాబాద్, మహా :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌కుమార్ యాదవ్‌కు మద్దతివ్వాలని, బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలు కోసం జరుగుతున్న పోరాటంలో ప్రభుత్వంతో కలిసి రావాలని సీపీఐ(ఎం)ను టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కోరారు. గురువారం హైదరాబాద్‌లోని సీపీఎం కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో ఆయన భేటీ అయ్యారు. పార్టీ నగర కమిటీతో చర్చలు జరుగుతున్నాయని, ఈ నెల 20న జరిగే తమ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో నిర్ణయాన్ని ప్రకటిస్తామని జాన్‌వెస్లీ తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని సూచించారు. దీనిపై మహేశ్‌కుమార్ గౌడ్ సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, టి.జ్యోతి, టి. సాగర్, మల్లు లక్ష్మి, అబ్బాస్, బండారు రవికుమార్, పలువురు రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

# కొండా సురేఖ గైర్హాజరు

**హైదరాబాద్, మహా:** కేబినెట్ భేటీకి మంత్రి కొండా సురేఖ హాజరు కాలేదు. తన ఇంటికి పోలీసులు రావడంపై ఆమె ఆగ్రహంగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే కేబినెట్ భేటీకి రాకూడదని మంత్రి సురేఖ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మంత్రులు అంతర్గత విషయాలు బయటపెట్టవద్దని, చర్చ చేయవద్దని.. ఏదైనా సమస్యలు, అపోహలు ఉంటే పార్టీ పెద్దల వద్ద పరిష్కరించుకోవాలని కేబినెట్ అభిప్రాయపడింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపుపై సుప్రీంకోర్టులో వేసిన స్పెషల్ లీవ్ పిటీషన్ డిస్మిస్ కావడంతో తదుపరి కార్యాచరణపై కేబినెట్ లో చర్చించారు. ఈ కేసును వాదించిన సీనియర్ న్యాయ వాదులు, న్యాయ నిపుణుల సలహాలు సూచనల మేరకు తదుపరి కార్యాచరణ చేపట్టాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రెండు రోజుల్లో న్యాయ నిపుణుల అభిప్రాయాలతో నివేదిక ఇవ్వాలని అధికారులకు సీఎం రేవత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

# శ్రీశైల మల్లన్న సేవలో ప్రధాని మోదీ

**ఏపీ సర్కారుపై ప్రశంసలు.. అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్**



**కర్నూలు, మహా :** ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ శ్రీశైలం క్షేత్రానికి చేరుకుని భ్రమరాంబ, మల్లికార్జున స్వామివారిని దర్శించుకున్నారు. మల్లికార్జునస్వామికి పంచామృతాలలో రుద్రాభిషేకం చేశారు. భ్రమరాంబాదేవికి ఖడ్గమాల సమర్పించారు. కుంకుమార్చన పూజలు చేశారు. అనంతరం శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు.

**ఏపీలో డబుల్ ఇంజిన్ సర్కార్: ప్రధాని మోదీ**

ఆత్మగౌరవం, సంస్కృతికి నిలయంగా ఆంధ్రప్రదేశ్ ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. కర్నూలు శివారులోని నన్నూరు వద్ద 'సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్' పేరుతో ఏర్పాటు చేసిన బహిరంగసభకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్, ఐటీమంత్రి నారాలోకేశ్ తదితరులు హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల నిర్మించిన, నిర్మించబోతున్న రూ.13,429 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. "సైన్స్, ఆవిష్కరణల కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ ఉంది. ఏపీలో అనంత అవకాశాలతో పాటు యువతకు అపార శక్తి ఉంది. అహోబిలం నర్సింహస్వామి, మహానంది ఈశ్వరుడికి నమస్కరిస్తున్నా. మంత్రాలయం రాఘవేంద్రస్వామి అందరినీ ఆశీర్వదించాలని కోరుతున్నా. జ్యోతిర్లింగం సోమనాథుడి నేల అయిన గుజరాత్‌లో నేను జన్మించాను. విశ్వనాథుడి భూమి అయిన కాశీకి సేవ చేసే అవకాశం లభించింది. ఇవాళ శ్రీశైలం మల్లికార్జునస్వామి ఆశీస్సులు పొందాను. చంద్రబాబు, పవన్ కల్యాణ్ రూపంలో ఏపీకి శక్తిమంతమైన నాయకత్వం ఉంది. ఏపీకి కేంద్ర ప్రభుత్వం పూర్తి మద్దతు ఉంది. 16 నెలలుగా రాష్ట్రంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోంది. డబుల్ ఇంజిన్ సర్కారు ఆధ్వర్యంలో రాష్ట్రం అపూర్వ ప్రగతి సాధిస్తోంది. ఢిల్లీ, అమరావతి వేగంగా అభివృద్ధి పథంలో సాగుతున్నాయి. 2047 నాటికి మన దేశం.. వికసిత్ భారత్‌గా మారుతుంది. 21వ శతాబ్దం.. 140 కోట్ల భారతీయుల శతాబ్దం" అని ప్రధాని మోదీ అన్నారు.



## గుజరాత్‌లో రాజకీయ సంక్షోభం

- **సీఎం మినహా మంత్రులంతా రాజీనామా**
- **నేడు కొలువుదీరనున్న నూతన మంత్రివర్గం**

**గుజరాత్, మహా:** గుజరాత్ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ శుక్రవారం జరుగనున్నది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర మంత్రులంతా గురువారం రాజీనామా చేశారు. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మాత్రమే రాజీమానా చేయలేదు. మంత్రివర్గంలో ఏకైక సభ్యుడిగా ఆయన కొనసాగుతున్నారు. గురువారం సాయంత్రం సీఎం నివాసంలో కీలక సమావేశం జరిగింది. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సాల్, సీఎం భూపేంద్ర పటేల్ పాల్గొన్నారు. మంత్రులందరిని వ్యక్తిగతంగా వారు కలిశారు. కేంద్ర నాయకత్వం నిర్ణయాన్ని వివరించి వారి నుంచి రాజీనామాలు స్వీకరించారు.

**కొత్త మంత్రివర్గం ఏర్పాటు..**

శుక్రవారం ఉదయం 11.30 గంటలకు గుజరాత్ కొత్త మంత్రివర్గం ఏర్పడనున్నది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సమక్షంలో గాంధీనగర్‌లోని మహాత్మా మందిర్‌లో కొత్త మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేయనున్నది. మరోవైపు ఐదారు మంది మంత్రులకు కొత్త మంత్రివర్గంలో చోటు దక్కనున్నట్లు తెలుస్తున్నది. మిగిలిన పదవులను కొత్తవారితో భర్తీ చేయనున్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు ముందు కుల, ప్రాంతీయ ప్రాతినిధ్యాన్ని సమతుల్యం చేయడం, ప్రభుత్వంలో కొత్త శక్తిని నింపేందుకు బీజేపీ విస్తృత వ్యూహంలో భాగంగా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపడుతున్నట్లు బీజేపీ వర్గాలు వెల్లడించాయి.

# వేర్ హౌస్‌లలో అవినీతి

**వైరా తరహాలో రాష్ట్రవ్యాప్తంగా అక్రమాలు.. రైస్ మాఫియాతో సర్కారుకు షాకులు**

**ఖమ్మం బ్యూరో, మహా:** ఖమ్మం జిల్లాలోని వైరా వేర్‌హౌస్‌లో వెలుగు చూసిన కుంభకోణం, మంచుకొండ అంచు మాత్రమే. ఈ మంచుకొండ కింద రాష్ట్రవ్యాప్తంగా విస్తరించిన ఒక వ్యవస్థీకృత అవినీతి సామ్రాజ్యం దాగి ఉంది. పేద ప్రజల ఆకలి తీర్చడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న పీడీఎస్ బియ్యం పంపిణీ వ్యవస్థ, ఇప్పుడు అధికారరాజకీయమిల్లర్ల త్రయం చేతుల్లో కోట్ల రూపాయల దందాగా మారిపోయింది. రాష్ట్రంలోని ఏ జిల్లా గోదాములను తనిఖీ చేసినా, "ధాన్యం మిస్సింగ్" లేదా "రికార్డుల్లో గోల్‌మాల్" అనే నివేదికలు తప్పకుండా బయటపడతాయని నిస్సందేహంగా చెప్పవచ్చు. పీడీఎస్ బియ్యం నల్ల బజారుకు మళ్లుతున్నంత కాలం, ఈ కుంభకోణాలు ఆగవు. ఈ దందాలో పట్టణ ప్రాంతాల నుండి పల్లె పల్లెకూ ఒక పకడ్బందీ వ్యవస్థ పనిచేస్తుంది. రాజకీయ నాయకుల అండదండలు, అధికారుల సహకారం, మిల్లర్ల అత్యాశ కలగలిపి పేదల బియ్యపు గింజలను బంగారు గుడ్లుగా మార్చుకుంటున్న వైనం ప్రజల్లో తీవ్ర ఆగ్రహాన్ని కలిగిస్తోంది

**బియ్యం రీసైక్లింగ్**

పీడీఎస్ అవినీతిలో అత్యంత దారుణమైన కోణం 'బియ్యం రీసైక్లింగ్' లేదా 'తిరిగి గోదాములకు దొడ్డిదారిన' చేర్చడం. వైరాలో జరిగినట్లుగా, పేదలకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని రేషన్ డీలర్లు, దళారులు కొనుగోలు చేసి, వాటిని పాలిష్ చేయించి, తిరిగి మిల్లర్ల ద్వారా ప్రభుత్వ గోదాముల్లోకి చేర్చేస్తున్నారు. దళారులు కేవలం ₹12₹15 కొనుగోలు ధరకు రేషన్ బియ్యాన్ని పేదల నుండి సేకరించగా, మిల్లర్లు ఈ బియ్యాన్ని పాలిష్ చేసి, వాటిని ఎఫ్.సి.ఐ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయని రికార్డుల్లో చూపి, ప్రభుత్వానికి తిరిగి అధిక ధరకు అమ్ముతున్నారు. ఈ మొత్తం ప్రక్రియను అధికారులు కళ్లు మూసుకొని లేదా ముడుపులు తీసుకొని ధృవీకరిస్తున్నారు. ఈ విధంగా పంపిణీ జరగకముందే నల్ల బజారుకు చేరిన బియ్యం, తిరిగి ప్రభుత్వ ఖజానాకే చేరి, దానికి మళ్లీ డబ్బులు చెల్లించే దుస్థితి. ఈ ద్విగుణీకృత దగా జరుగుతున్నా, పర్యవేక్షణ వ్యవస్థ ఎక్కడా పనిచేయడం లేదు.

**రాజకీయ 'ప్రసాదం' .. పైరవీల పర్వం**

ఈ మాఫియా వ్యవస్థ ఇంత బలంగా పాతుకుపోవడానికి ముఖ్య కారణం రాజకీయ అండదండలు. వేర్‌హౌస్‌ల చైర్మన్ల నుండి స్థానిక ఎమ్మెల్యేల వరకూ ఈ సిండికేట్‌లో భాగస్వాములు అవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా గోదాముల్లో అవినీతి బయటపడిన ప్రతిసారీ, విచారణ వేడి తక్షణమే చల్లబడుతోంది. ఉన్నతాధికారుల బదిలీలు, తాత్కాలిక సస్పెన్షన్లు మినహా, నిందితులపై క్రిమినల్ కేసులు కానీ, ఆస్తుల జప్తు కానీ జరగడం లేదు. "ఎన్నికల నిధుల" పేరుతో అధికార పార్టీ నాయకులు ఈ అవినీతికి ఒక అనైతిక లైసెన్స్ ఇస్తున్నారనే గుసగుసలు బహిరంగ రహస్యమే. దీనివల్ల నిస్సహాయులైన నిజాయితీపరులైన అధికారులు కూడా ఒత్తిడికి తలొగ్గి మౌనంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అవినీతిని అరికట్టడానికి ప్రభుత్వం సీసీ కెమెరాలు, డిజిటల్ రికార్డింగ్, ఆన్‌లైన్ ట్రాకింగ్ వంటి సాంకేతికతను ప్రవేశపెట్టినా, మాఫియా వర్గాలు వాటిని సైతం తమకు అనుకూలంగా మార్చుకుంటున్నాయి. రికార్డుల నిర్వహణను ఇప్పటికీ మ్యాన్యువల్‌గా ఉంచడం, సీసీ కెమెరాలు పనిచేయకుండా చూసుకోవడం, క్వాలిటీ కంట్రోల్ టెస్ట్‌లను తప్పుగా నివేదించడం వంటి పద్ధతుల ద్వారా కోట్ల రూపాయల బియ్యం దారి మళ్లిస్తున్నారు. సాంకేతికతను ఆశీర్వదించాల్సిన అధికారులు, దానిని శపించడం ఈ మాఫియా పాలిట వరంగా మారింది. ప్రభుత్వ ఏజెన్సీలతో కాకుండా, స్వతంత్ర థర్డ్‌పార్టీ ఏజెన్సీ ద్వారా ప్రతి మూడు నెలలకోసారి గోదాముల స్టాక్ ఆడిట్ చేయించాలి. పీడీఎస్ వ్యవస్థపై పేద ప్రజలకు నమ్మకం నిలబడాలంటే, 'ఆపరేషన్ వైరా' తరహా విచారణ రాష్ట్రంలోని ప్రతి వేర్‌హౌస్‌లో జరగాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# సోషల్ మీడియా ఛానళ్లకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ వార్నింగ్

- సోషల్ మీడియాలో ఫేమస్ అయ్యేందుకు చిన్నారులను బలిపెట్టవద్దని వ్యాఖ్య
- పిల్లలతో అనుచిత కంటెంట్ చేయించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిక
- లైక్స్, వ్యూస్ మాయలో పడి విలువలను మర్చిపోతే ఎలా?



**హైదరాబాద్, మహా:** యూట్యూబ్ ఛానళ్లపై హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ సీరియస్ అయ్యారు. లైక్స్, వ్యూస్ మాయలో పడి విలువలను మర్చిపోతే ఎలా అని ప్రశ్నించారు. వ్యూస్, లైక్స్‌తో సామాజిక మాధ్యమాల్లో ఫేమస్ అయ్యేందుకు చిన్నారుల భవితను పణంగా పెట్టడం ఎంతవరకు సమంజసమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనర్లతో కొన్ని యూట్యూబ్ ఛానళ్లు చేస్తున్న ఇంటర్వ్యూలను ఉద్దేశిస్తూ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వీసీ సజ్జనార్ పోస్ట్ పెట్టారు. చిన్నారులతో అసభ్యకరమైన కంటెంట్‌ను చేస్తూ, సభ్య సమాజానికి ఏం మెసేజ్ ఇస్తున్నారు? చిన్నారులు, యువతకి స్ఫూర్తినిచ్చే, ఆదర్శంగా నిలిచే వ్యక్తులను ఇంటర్వ్యూలు చేసి సమాజాభివృద్ధికి దోహదపడండి. అంతేకానీ ఇలాంటి వీడియోలు వారితో చేసి పిల్లలను పెడదోవ పట్టించే పనులు చేయొద్దు. గుర్తు పెట్టుకోండి. ఇది బాలల హక్కుల ఉల్లంఘనే కాదు, చట్టరీత్యా నేరం కూడా."....ఎక్స్‌లో సీపీ సజ్జనార్ . చిన్నారులతో అసభ్యకరమైన కంటెంట్‌ను చేయడం లాంటి చర్యలు పోక్సో, జువైనల్ జస్టిస్ చట్టాలను ఉల్లంఘించడమేనని సీపీ సజ్జనార్ ఎక్స్‌లో పేర్కొన్నారు. పిల్లలను ఇలాంటి కంటెంట్‌లో భాగం చేయడం, వారిని వేధించడం కిందికే వస్తుందని తెలిపారు.

**వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం**

మైనర్లతో ఈ తరహా కంటెంట్‌ను చేసే వారి పట్ల పోలీస్ శాఖ చాలా కఠినంగా వ్యవహరిస్తుందని సీపీ సజ్జనార్ 'ఎక్స్'లో తెలిపారు. అలాంటి వాటికి సంబంధించిన బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటుందన్నారు. తక్షణమే వీటిని తొలగించకున్నా, భవిష్యత్తులో ఇలాంటి కంటెంట్ అప్‌లోడ్ చేసినా చట్టప్రకారం కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు.

**ఇలాంటి వీడియోలపై వెంటనే రిపోర్ట్ చేయండి**

సోషల్ మీడియాలో ఇలాంటి వీడియోలు మీ దృష్టికి వచ్చినట్లయితే వెంటనే రిపోర్టు చేయాలని యూజర్లను కోరారు. స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. హెల్ప్‌లైన్ నంబర్ 1930కి గానీ, నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్ (cybercrime.gov.in)లో ఫిర్యాదు చేయొచ్చన్నారు. తల్లిదండ్రులుగా పిల్లలను పెంచడం మాత్రమే కాదు, వారి బాల్యం, మానసిక ఆరోగ్యం, భవిష్యత్తును కాపాడటం కూడా మీ బాధ్యతే అనే విషయం మరిచిపోవద్దని సజ్జనార్ పేర్కొన్నారు.ఇటీవల కాలంలో సోషల్ మీడియా వినియోగం క్రమంగా పెరిగింది. ఈ క్రమంలోనే కొంతమంది ఎక్కువ వ్యూస్, లైక్స్ రావడం కోసం మైనర్లతో ఇంటర్వ్యూలు చేస్తున్నారు. అలాంటి వాటివల్ల మైనర్లపై చెడు ప్రభావం కలిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే సీపీ సజ్జనార్ యూట్యూబ్ ఛానళ్లను ఉద్దేశిస్తూ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అనుచిత వీడియోలు చేసే వారిపై కఠిన చర్యలకు కూడా వెనకాడమని ఆయన హెచ్చరించారు.

**ఇటీవలే స్పష్టంగా చెప్పిన సీపీ సజ్జనార్**

హైదరాబాద్ నూతన కమిషనర్‌గా వీసీ సజ్జనార్ ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. సైబర్ నేరాలు, ఆర్థిక నేరాలు అరికట్టడంతో పాటు మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని ఆయన ఇదివరకే స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగానే తాజాగా యూట్యూబ్ ఛానళ్లకు సజ్జనార్ వార్నింగ్ ఇవ్వడం విశేషం. మరోవైపు బెట్టింగ్ భూతంపై కూడా సజ్జనార్ పోరాడుతున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ వల్ల వచ్చే అనర్థాలపై ఇప్పటికే ఆయన ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు...

# జూబ్లిహిల్స్ లో ఓట్ చోరీ


## హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసిన బీఆర్ఎస్ జోక్యం చేసుకోలేమన్న కోర్టు

**హైదరాబాద్, మహా :** ఉప ఎన్నిక జరుగుతున్న జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఓట్ల చోరీ అంశంపై బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్‌పై జోక్యం చేసుకోలేమని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఓట్ల చోరీ జరిగిందంటూ మాగంటి సునీత, బీఆర్ఎస్ లంచ్ మోషన్ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై బీఆర్ఎస్ తరఫున న్యాయవాది శేషాద్రినాయుడు వాదనలు వినిపించారు. నియోజకవర్గంతో సంబంధం లేని వారికి ఓట్లు ఉన్నాయని కోర్టుకు తెలిపారు. ఒకే ఇంట్లో 43 మంది ఓటర్లు నమోదు అయ్యారని, బోగస్ ఓట్లపై ఎన్నికల సంఘానికి ఆధారాలు సమర్పించినా చర్యలు తీసుకోవడం లేదని వాదించారు. ఈసీ తరఫున లాయర్ వాదనలు వినిపిస్తూ సుప్రీంకోర్టులో బిహార్ ఎలక్షన్లపై విచారణ నడుస్తోందని, నామినేషన్ల చివరి తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని కోర్టుకు తెలిపారు. బీఆర్ఎస్ రిప్రజెంటేషన్‌పై ఎన్నికల అధికారికి ఆదేశించాలని, నివేదికను బట్టి చర్యలు తీసుకుంటామని కోర్టుకు తెలిపారు. కొత్తగా నమోదైన ఓటర్ల సంఖ్య 8 వేలు అయితే బీఆర్ఎస్ 12 వేలు అని చెబుతుందని, 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కును నమోదు చేసుకున్నారని ఈసీ తరఫు లాయర్ వాదనలు విన్న న్యాయస్థానం ఇప్పటికే ఎలక్టోరల్స్ ని ఈసీ రివిజన్ చేస్తోందని ఈ సమయంలో ఎలాంటి డైరెక్షన్ అవసరం లేదని పేర్కొంటూ విచారణను ముగించింది.

# సదర్ ఉత్సవాలకు రండి..

## సీఎం రేవంత్ కు శ్రీకృష్ణ సమ్మేళన్ ఉత్సవ కమిటీ ఆహ్వానం

## 19న ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్న సదర్ సమ్మేళన్



**పల్లవి, మహా:** హైదరాబాద్‌లో జరగనున్న సదర్ సమ్మేళనంలో పాల్గొనాల్సిందిగా సీఎం రేవంత్ రెడ్డిని శ్రీకృష్ణ సదర్ సమ్మేళన్ ఉత్సవ కమిటీ ఆహ్వానించింది. గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సదర్ సమ్మేళన్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు ముఖ్యమంత్రిని కలిసి ఆహ్వానాన్ని అందించారు. ఈ నెల 19వ తేదీన ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్న సదర్ సమ్మేళన్‌లో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ తో పాటు ఇతర ప్రతినిధులు ఉన్నారు.

**రాష్ట్ర పండుగగా గుర్తింపు..**

దీపావళి సందర్భంగా నిర్వహించే సదర్ సమ్మేళన్‌ను రాష్ట్ర పండుగగా గుర్తించింది తెలిసిన విషయమే. ఇక నుంచి యేటా సదర్ సమ్మేళన్‌ను రాష్ట్ర పండుగగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించింది. దీపావళి పండుగ తర్వాత రోజున పశుపాలకులు దున్నపోతులను అలంకరించి ఆడుతూపాడుతూ సదర్ సమ్మేళన్ నిర్వహించడం తెలంగాణలో సంప్రదాయంగా వస్తోంది.

# బిగ్ బాస్ షో బ్యాన్ చేయాలి

## జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు

## సమాజానికి ఎలాంటి సందేశాన్ని ఇస్తుందని అభ్యంతరాలు



**హైదరాబాద్, మహా:** బిగ్ బాస్ షోపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. గజ్వేల్ కు చెందిన కమ్మరి శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, సుకుమార్ రెడ్డి, చంద్ర శేఖర్, శ్రీనివాస్ లు ఈ ఫిర్యాదు చేశారు. బిగ్ బాస్ షో సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తుందని, షోకు సెలెక్ట్ అయిన వారిలో కొంతమందికి సమాజంలో విలువ లేదు అని, బిగ్ బాస్ టీం కుటుంబ విలువలు పాటించని వారిని షోకు ఎంచుకుంటుందని ఫిర్యాదులో ఆరోపించారు. దివ్వెల మాధురి, రీతూ చౌదరి లాంటి వారిని సెలెక్ట్ చేసుకొని బిగ్ బాస్ సమాజానికి ఎలాంటి సందేశాన్ని ఇస్తుంది వారు ఫిర్యాదులో అభ్యంతరాలు లేవనెత్తారు. సమాజం సిగ్గు పడే విధంగా నిర్వాహకులు బిగ్ బాస్ షో నిర్వహిస్తున్నారని, వెంటనే బిగ్ బాస్ షోను నిలిపివేయాలని కోరారు. బిగ్ బాస్ పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే బిగ్ బాస్ హౌస్‌ను ప్రజా సంఘాలు, మహిళా సంఘాలతో కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు. కర్ణాటకలో చేసిన విధంగా ఇక్కడ కూడా బిగ్ బాస్ బ్యాన్ చేయాలన్నారు. సీనియర్ హీరో నాగార్జున సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేయాలని కోరారు.

# కరెప్షన్‌కు కేరాఫ్ కాంగ్రెస్

## మంత్రి కుటుంబ ఆరోపణలపై విచారణ జరపాలి

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు డిమాండ్

**హైదరాబాద్, మహా :** డెక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం రాషఅట్ర ప్రభుత్వంలోని పెద్దలు కొందరు బెదిరింపులకు దిగారంటూ మంత్రి కూతురు చేసిన ఆరోపణలపై విచారణ జరిపించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడిన పార్టీ చీఫ్ సిమెంట్ ఫ్యాక్టరీ యజమానిని బెదిరించడంలో పెద్దవారి హస్తముందని కొండా కుటుంబ సభ్యులు అంటున్నారని.. దీని వెనుక ఎవరెవరు ఉన్నారో బయట పెట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. 'పోలీసులు ఓ మంత్రి ఇంట్లోకి వెళ్లారు. మంత్రి కూతురు..సీఎం రేవంత్ రెడ్డితో పాటు అనేక మందిపై ఎలిగేషన్ చేశారు. సిమెంట్ కంపెనీల యజమానులను బెదిరింపులకు పాల్పడినట్లు చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్, కరెప్షన్ సమానంగా ప్రయాణం చేస్తున్నాయి. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ దీనిపై వివరణ ఇవ్వాలి. ఇది దోచుకునే ప్రభుత్వంగా మారిపోతోంది. టికెట్‌లు కూడా దోచుకునే వారికే ఇస్తున్నారు' అని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మంత్రి కూతురు చేసిన ఆరోపణలపై పాలక పార్టీ ప్రజలకు సమాధానం చెప్పాల్సిందేనని అన్నారు. గత ప్రభుత్వం దోచుకున్న సొత్తు పంచుకుంటున్నారని.. ఇప్పుడు దోచుకున్న సొత్తు పెంచుకునేందుకు తప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఈ ప్రభుత్వం దోచుకునే ప్రభుత్వమా అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో తెలంగాణను దోచుకున్న పార్టీలను ఓడించాలని రాంచందర్ రావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ డీఎన్ఏ.. అవినీతి, తప్పుడు పాలన, దోపిడీ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. సిమెంట్ కంపెనీ యాజమాన్యాన్ని బెదరించిన వారిలో సీఎంకు అత్యంత సన్నిహితులున్నారని, వారిపై ఏం చర్యలు తీసుకుంటారని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల సొమ్మును దేశ వ్యాప్తంగా వేర్వరు రాష్ట్రాలలో జరుగుతున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పంచి పెట్టేందుకు దోపిడీకి తెరలేపిందని దుయ్యబట్టారు. ప్రజా పాలన అందిస్తున్నామంటున్న కాంగ్రెస్ పార్టీ బెదరింపులకు దిగుతూ అందినంత దండుకుంటుందన్నారు. మంత్రి కుటుంబమే అవినీతి ఆరోపణలను చేసిందంటే పాలక పక్షం దోపిడీ ఏ మేరకు ఉందో ప్రజలు గుర్తించాలన్నారు.



# నేనున్నంతవరకు అన్నదానం ఆగదు

## కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా :** తాను బతికున్నంత వరకు నిత్యాన్నదానం కొనసాగుతుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. కేఎస్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పట్టణంలోని ప్రజా సేవాభవన్ లో గత మూడున్నరేళ్ళుగా నిరంతరాయంగా కొన సాగుతున్న నిత్యాన్న దాన కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. కేంద్రానికి ఆకలి తీర్చుకోవడానికి వచ్చిన అందరికి నమస్కరిస్తూ ఆప్యాయంగా పలకరించారు. ఎలా ఉన్నారంటూ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. భోజనం, తాగునీటి సౌకర్యాలను పరిశీలించారు. వచ్చిన వారికి ఆయన స్వయంగా వడ్డన చేస్తూ కడుపు నిండా భోజనం చేయాలని కోరారు. కంది శ్రీనివాస రెడ్డి చేస్తున్న నిత్యాన్న దానంతో పాటు సామాజిక సేవలను అందరు ప్రశంసించారు.పేదల ఆకలి తీర్చడం భగవంతుడు తనకు కల్పించిన అదృష్టమని కంది శ్రీనివాస రెడ్డి అన్నారు.తరుచుగా వచ్చేవారితో పాటు ఆదిలాబాద్ కు చుట్టుపక్కల గ్రామాల వారు ఏ పని మీద వచ్చినా మధ్యాహ్నం వేళ అన్నదాన కేంద్రంలో భోజనం చేయవచ్చని తెలిపారు.

# ఆహార వృధాను అరికడదాం

## కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జె.సి.రాజు



**విజయనగరం జిల్లా.మహా:** అన్నాన్ని దైవంగా భావించి ప్రతివారు ఆహార విషయం లో తగిన జాగర్తలు తీసుకుంటూఆహార వృధాను అరికట్టవలసిన భాద్యత ప్రతి ఒక్కరిపై ఉందని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జె సి రాజు అన్నారు. ప్రపంచ ఆహార భద్రత దినోత్సవ నేపథ్యంలో గురువారం బొబ్బిలి పట్టణం కారుణ్య కార్యాలయం లో, గోడ పత్రికల ప్రదర్శన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది ఆహారం లేక అల్లాడిపోతుంటే మరోవైపు అధిక మొత్తంలో ఆహారం చెత్తబుట్ట పాలవుతుందన్నారు. వేడుకల్లో, హోటళ్లలో, రెస్టారెంట్లలో ఆహారం వృధా అవుతుందన్నారు. *మెరుగైన ఆహారం,మెరుగైన భవిష్యత్ కోసం చేయి చేయి కలుపుదాం అన్న నినాదంతో ఆహార వృధాను అరికట్టేందుకు నడుం బిగించాలన్నారు. ఆకలి కేకలు లేని ప్రపంచాన్ని నిర్మించాలంటే ఆహార వృధాను అరికట్టేందుకు అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఆహారాన్ని వృధాగా పారబోస్తే ఆహారాన్ని పండించటానికి అవసరమైన నీరు, ఎరువులు,విలువైన మానవ శ్రమ డబ్బు వృధా అవుతున్నాయన్నారు పాఠశాల దశనుండేవిద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. రెస్టారెంట్లలో,హోటళ్లలో,వేడుకల్లో మిగిలిన ఆహారాన్ని సేకరించిఅవసరమైన వారికి అందించాలన్నారు. స్వచ్ఛంద సంస్థలకు ప్రభుత్వంతోడ్పాటు అందించాలని కోరారు. ఆహార వృధా పై సమాజానికి అవగాహన కల్పించిన్నప్పుడే ప్రయోజనం కలుగుతుందన్నారు.కార్యక్రమంలో కారుణ్య చీఫ్ ట్రస్టీ పి వి ఏ మెర్సీ రాజ్, కార్యదర్శి ప్రవీణ్ కుమార్, సభ్యులు రామ కృష్ణ, అశోక్, చిన్నారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.




# ఎస్పీసీఏ వెబ్ సైట్, లోగో ఆవిష్కరణ

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్ర పోలీస్ కంప్లైయింట్ అథారిటీ (ఎస్పీసీఏ)కి సంబంధించిన రూపొందించిన ప్రత్యేక వెబ్ సైట్‌ను, లోగోను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణా రావు, తెలంగాణ డీజీపీ బి. శివధర్ రెడ్డి, హోం శాఖ స్పెషల్ సీఎస్ సీవీ ఆనంద్, సీజీజీ డీజీ రవి గుప్త, ఎస్పీసీఏ చైర్మన్ జస్టిస్ బి. శివశంకర్ రావుతో పాటు ఇతర సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌కు షాక్

## కాంగ్రెస్ పార్టీలో చేరిన ఇద్దరు కుల సంఘ అధ్యక్షులు

## కండువాలు కప్పి స్వాగతించిన కంది శ్రీనివాస రెడ్డి .. స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందడుగు



**ఆదిలాబాద్ మహా :** స్థానిక సంస్థల ఎన్నికల ముంగిట కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయి.ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో నిత్యం చేరికలు జరుగుతున్నాయి. తాజాగా గురువారం ఆదిలాబాద్ పట్టణం నుండి మహిళా పద్మశాలి సంఘం అధ్యక్షురాలు బీఆర్ఎస్ పార్టీ కి చెందిన తన్నీరు నవత తో పాటు బీఆర్ఎస్ నుండి జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షులు గొడ్డండ్ల శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కంది శ్రీనివాస రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. స్థానిక ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా అంతా కలసి ముందుకు సాగుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో తాలూక పద్మశాలి సంఘం అధ్యక్షులు బొమ్మకంటి రమేష్ ,బూర్ల శంకరయ్య,మోర ఆశన్న, దాసరి ఆశన్న, ఎంఏ షకీల్, శ్రవణ్ నాయక్,దర్శనాల లక్ష్మణ్, అజయ్, దత్తు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పోషణ లోపం లేని సమాజాన్ని నిర్మించాలి

## బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్

**బెల్లంపల్లి, మహా:** పోషణలోపం లేని సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ వెల్లడించారు. గురువారంనాడు బెల్లంపల్లి మండలం తాళ్లగురజాల రైతు వేదికలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, సీడీపీఓ స్వరూప రాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మనోజ్ సమతుల్య ఆహారం గురించి వివరించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ పోషణ లోపం లేని సమాజాన్ని నిర్మించాలని తెలిపారు. పిల్లలు రక్తహీనత ఇతర రుగ్మతలు రాకుండా చూడాలని, నాణ్యమైన పోషణ అందించాలన్నారు. గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు,అనుబంధ పోషకాహార ప్రాముఖ్యత, ఐవైసీఎఫ్ పద్ధతులు, తల్లిపాలప్రాముఖ్యత, ఈసీసీఈ ప్రాముఖ్యత గురించి వివ రించారు. కార్యక్రమంలో పీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ ఇవాంజెలినా, సూపర్వైజర్స్ , పోషణ అభియాన్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ రజిత, డీపిఎ శ్యామల, ఉమెన్ హబ్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ సౌజన్య, అంగన్వాడీ టీచర్స్, గర్భిణీ స్త్రీలు, ప్రీ స్కూల్ పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నాణ్యతతో పనులను త్వరగా పూర్తి చేయాలి

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, మహా :** విద్య వ్యవస్థ అభివృద్ధి చర్యలలో భాగంగా జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని చెన్నూరు మండలం కిష్టంపేట గ్రామంలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణ పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్ తో కలిసి పరిశీలించారు. పనుల నిర్వహణలో నాణ్యమైన సిమెంట్, ఇసుకను వినియోగించాలని, పనులలో నాణ్యత పాటించాలని తెలిపారు. తెలంగాణ సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల, సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించి కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని చెన్నూర్ మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్ లతో కలిసి పరిశీలించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగా పాఠశాలలో చేపట్టిన విద్యుత్, మూత్రశాలలు, భోజనశాల ఇతర అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు త్రాగునీటి అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం అమృత్ 2.0 పథకం ద్వారా నీటి ట్యాంకులు నిర్మించి త్రాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటుందని, ఈ నేపథ్యంలో పనులను త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. చెన్నూరు పట్టణంలోని భవిత కేంద్రాన్ని సందర్శించి ప్రత్యేక అవసరాలు గల పిల్లల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్థానిక ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుందని, అధికారులు పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ త్వరగా పూర్తి చేసే విధంగా గుత్తేదారు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్

## కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్ మహా :** నియోజక వర్గ ప్రజలకు ఎప్పుడు ఏ అవసరమొచ్చినా తాను అండగా ఉంటానని వారి సమస్యల పరిష్కారం కోసమే ప్రతీ వారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం పట్టణం లోని తన క్యాంపు కార్యాలయం ప్రజా సేవ భవన్ లో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కు ఆయన హాజరయ్యారు.నియోజకవర్గంలోని పలు ప్రాంతాలనుండి తరలివచ్చిన ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజాదర్బార్ లో తమ సొంత సమస్యలు , గ్రామ సమస్యలు, వార్డు, కాలనీల సమస్యలను కంది శ్రీనివాస రెడ్డి దృష్టికి తెచ్చారు. తమ సమస్యల పై ఆయనకు దరఖాస్తులు సమర్పించారు. ప్రజాదర్బార్ లో ఏర్పాటు చేసిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అప్లికేషన్ల డాటాను ఎప్పటికప్పుడు భద్రపరిచి అప్డేట్ పరిశీలిస్తామన్నారు.ఆయా సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ పరిష్కారం కోసం శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దిగంబర్ రావు పాటిల్,గిమ్మ సంతోష్, కొండ గంగాధర్, సంద నర్సింగ్, రాంకుమార్,దర్శనాల లక్ష్మణ్,ఏవన్,ఫైజుల్లా ఖాన్, అల్చెట్టి నాగన్న, ప్రభావతి,శ్రీలేఖ,సోనియా మంథని ,బూర్ల శంకరయ్య, కొండూరు రవి,అతీఖ్,చంద్రశావ్,అజయ్,రఫీక్,ఎల్టి భోజా రెడ్డి,ఎం ఏ షకీల్,శ్రావణ్ నాయక్,బోనగిరి సంటెన్న,దాసరి ఆశన్న,బీమనవేని రాములు,ముక్కెర సంతోష్,నక్కల దత్తు, రవీందర్, తిర్మన్ మహేందర్,సురేందర్ రెడ్డి,ప్రశాంత్,గౌతమ్ ఎల్మ రామ్ రెడ్డి, పుంద్రు నరేష్ రెడ్డి, ఖయ్యూం,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ సంఘాల బంద్ కు తెదేపా పార్టీ సంపూర్ణ మద్దతు



**బెల్లంపల్లి,మహా:** ఈనెల 18వ తేదీ న బీసీ సంఘాల ఐక్యవేదిక జేఏసీ తలపెట్టిన బంద్ కు తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ దాని అనుబంధ కార్మిక సంఘం టిఎన్టియుసి ప్రధాన కార్యదర్శి టి మణిరాం సింగ్ స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రధాన లక్ష్యం బడుగు బలహీనవర్గాల సంక్షేమేనని తెలియజేశారు. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఎల్లప్పుడూ బడుగు బలహీన వెనుకబడిన వర్గాలను చైతన్యపరుస్తూ రాజ్యాధికారం కల్పించే దిశగా కృషి చేస్తూనే ఉంటారని, పాలక ప్రభుత్వానికి నిజంగా బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే స్థానిక ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్లను కల్పించి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని బీసీలను అడ్డుపెట్టుకొని రాజకీయ లబ్ధి పొందాలని చూస్తే ప్రజలు క్షమించరని అలాగే బీసీలు దేశానికి వెన్నుముక లాంటి వారిని తెలుగుదేశం పార్టీ బీసీలకు సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా అవకాశాలు కల్పించిందని తెలిపారు. మొట్టమొదటిసారిగా 33% బీసీలకు రిజర్వేషన్ కల్పించింది తెలుగుదేశం పార్టీ ఏ తెలంగాణ రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్ల సాధించుకునే అంతవరకు బీసీ సంఘాల నాయకులు ఐక్యంగా సకలజనుల సమ్మెచేసి తెలంగాణ సాధించుకున్నామనీ తెలిపారు.బీసీ రిజర్వేషన్లను కూడా సాధించుకునే అంతవరకు పోరాటం చేద్దామని ప్రకటించారు. ఈ సమావేశంలోకరేపా పార్టీ పట్టణఅధ్యక్షుడు టి.మణిరామ్ సింగ్,ఎస్సీఎల్ యు ప్రధాన కార్యదర్శి గద్దల నారాయణ,ఎస్ సి ఎల్ యు ఉపాధ్యక్షులు బొల్లుమల్లయ్య, పట్టణ ఉపాధ్యక్షులు ఓ జీవరత్నం,పట్టణ ప్రధాన కార్యదర్శి చింత రమేష్,నాయకులు ఆర్.గంగాధర్ గౌడ్, ఎస్ ఎస్ పాండే,ఎస్.కె అస్గర్ పాషా, ఎండి హాసన్, గైని తిరుపతి, ఎం రాజయ్య, భూపాల శంకర్, బొల్లు సత్యనారాయణ, మాదాసి గోపాల్ పాల్గొన్నారు

# ఆద్యకళ మ్యూజియం కోసమే ఆయన తండ్లాట!

జానపద పరిశోధకుడిగా, పురా కళాఖండాల, పనిముట్ల, చారిత్రక ఆనవాళ్ల సేకరణకర్తగా ప్రొ. జయధీర్ తిరుమలరావు చేసిన కృషి సాటి లేనిది. అయితే ఆయన తండ్లాట అంతా తాను కూర్చిన ఆ అమూల్య పరికరాలను ప్రభుత్వ నిర్వహణలో ఒక మ్యూజియం రూపంలో చూడాలనుకోవడమే. దాని కోసం ఆయన కొన్ని ఏళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెద్దల చుట్టూ తిరుగుతున్నారు. ముప్పావు జీవితం గడిచిన ముదిమి వయసులోనూ వాటి సేకరణలో ఆయన విశ్రమించలేదు. దూరాభారాలు లెక్కచేయకుండా ఒంటరిగా దేశమంతా తిరుగుతున్నారు. తిరుమలరావు చేస్తున్న పనిని ఒక్క మాటలో చెప్పలేము. వస్తు సేకరణ ఎంతో శ్రమతో కూడుకున్న కార్యం. అది ఒకచోట కూచుంటే అయ్యేది కాదు. గ్రామీణ, సాంప్రదాయిక కళ సామాగ్రిని కనుగొని సేకరించడం మరీ కష్టమైన పని. గ్రామాలకు వెళ్ళాలి, డొంక దారుల్లో నడక సాగించాలి. ఆయా వస్తువుల సొంతదారులతో మమేకమవ్వాలి, వస్తువులను అప్పగించేందుకు వాటి భద్రతకు వారిలో విశ్వాసం కలిగేలా నమ్మకమీయాలి. సేకరించిన వాటిని వాతావరణానికి చెడిపోకుండా, దెబ్బతినకుండా భద్రపరచగలగాలి. ఎలా కాపాడాలో శాస్త్రీయంగా తెలిసుండాలి. వాటన్నిటిని పసిపిల్లల్ని సాకినట్లు సున్నితంగా చూసుకోవాలి. ఫలానా చోట ఓ పాతకాలపు వస్తువు ఉందంటే ఉన్నపళంగా ప్రయాణం కడతారు. సమయాన్ని, శ్రమను, ఖర్చును లెక్కించకుండా చేతికందిన ఆ కళాకృతిని చూసి మురిసిపోతారు. శ్రామిక కులాల సాంస్కృతిక సంపద, దళిత, ఆదివాసీ, బహుజన కళలు, కళారూపాలు, కళాకృతులు సంరక్షణే ధ్యేయంగా ఆయన పయనం సాగుతోంది. తరతరాలుగా ఉత్పత్తి కులాలు తమ పని ముట్లను తామే తయారు చేసుకున్నట్లు వీరి సేకరణ నిరూపిస్తుంది. మానవ వికాస క్రమంలో వివిధ వృత్తుల్లో ఉత్పత్తికి తోడ్పడిన ఈ మూల పరికరాల, వాద్యాల, కళారూపాల పరిరక్షణ, ప్రదర్శన ఎంతో ప్రాముఖ్యతతో కూడుకున్నది. విశ్వకర్మలు వెయ్యేళ్ల క్రితమే రుంజ ను మోగించినట్లు చరిత్ర చెబుతోంది.




నాయకపోడు ఆదివాసీలు మూగ డోలు, బైండ్ల వారి జమిడిక, రాజన్నలు వాయించే చామల్లాలి, దడదడలాడే మాదిగ డప్పు, సిద్దిల మార్ఫా, కోయల డోలు, చెంచుల జేగంటలు, గుత్తికోయల గుజ్జడి మొగ్గలు అన్ని ఆనాటి వైభవ సంస్కృతులే. సాంస్కృతిక వారసత్వ కళా సంపదల పట్ల ఆసక్తితోనే దేశ విదేశీ యాత్రికులు చార్ మినార్, గోల్కొండ, సాలార్ జంగ్ మ్యూజియంలను చూసేందుకే హైదరాబాద్ కు వస్తుంటారు. 'ఆద్య కళ' వీటి వరుసలో చేరుతుంది. సుమారు ముప్పై ఏళ్లుగా ఆయన సేకరిస్తున్న వీటిలో ఆదిధ్వని, ఆదిచిత్రం, ఆదిఅక్షరం, లోహ కళ అనే నాలుగు విభాగాలున్నాయి. ఆదిధ్వనిలో 350 కి పైగా రకరకాల ఆదివాసీ జానపద సంగీత వాద్యాల ప్రదర్శన ఉంది. ఆదిచిత్రంలో వివిధ ఆకారాల వస్త్రాలపై పండుగలు, సాంప్రదాయ ఆచరణకు చెందిన చిత్రాలు ప్రాకృతిక రంగులతో వేసిన చిత్రాలు, నకాషి బొమ్మలు ఉన్నాయి..ఇందులో కొన్ని మూడు వందల ఏళ్ళనాటివి కూడా ఉన్నాయి. ఆది అక్షరంలో తాళపత్రాలతో పాటు అక్షరాలు చెక్కిన తోలు పట్టాలు వింత గొల్పుతాయి. 500 కు పైగా ఉన్న ఈ అక్షరావళిలో 15 నుండి 20 మీటర్ల పొడవున్న ముతక కాగితపు చుట్టాల్లో చరిత్ర దాగిఉంది. యాదవులకు చెందిన కాటమరాజు చరిత్ర వీటిలో ఒకటి. వివిధ లోహాలు, మిశ్రమధాతువులతో రూపొందించిన చిన్న పెద్ద విగ్రహాలు నాటి హస్తకళల నైపుణ్యాన్ని చాటిచెబుతాయి.




ప్రభుత్వ విభాగాలు లక్షలు వెచ్చించి చేసే పనిని ఆయనొక్కరు సొంత ఖర్చులతో చేసి పెట్టారు. ఏ రకంగా చూసినా వాటిని తెలంగాణ ప్రభుత్వం కళ్ళకద్దుకొని తీసుకోవాలి. తగినట్లుగా ఒక సందర్శనశాలను ఏర్పాటు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం నాలుగు ఎకరాల స్థలం లేదా ఏదో ఒక వాడకంలో లేని భవనం ఇస్తే అందులో మ్యూజియం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ మంజూరు చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం వైపు నుండే అడుగు ముందుకు పడాల్సి ఉంది. హైదరాబాద్ లో గత అయిదేళ్లుగా ప్రధాన గ్యాలరీలలో కొనసాగుతున్న వీటి ప్రదర్శనను, జనాదరణను గమనించి ప్రభుత్వం, సంబంధిత శాఖలు ఇప్పుడైనా ముందుకు రావాలి. నగరంలో ఎక్కడో ఓ చోట ఎన్నో ఆదివాసీ తెగలు, జానపద సమూహాలకు చెందిన ఈ అపురూప వస్తు సంచయం పాడు కాకముందే ఒక గూడు కల్పించవలసి ఉంది. తెలంగాణ ప్రభుత్వం నిపుణుల కమిటీ ఏర్పాటు చేసి సేకరించిన సామాగ్రిపై ఒక నివేదికను తెప్పించి పరిశీలించాలి. మూడేళ్ల క్రితం పురాతత్వ ప్రదర్శనశాల వారి ఆహ్వానంపై తిరుమలరావు పారిస్ వెళ్లారు. ఆద్య కళ మ్యూజియం గురించి, తెలంగాణ ప్రాంతపు, భారత దేశపు జానపద ఆదివాసి కళల గురించి, సంస్కృతి గురించి, ముఖ్యంగా వస్తు సంస్కృతి అధ్యయనాల గురించి ఆయన అక్కడ ప్రసంగించారు. అప్పుడు జర్మనీ, స్విట్జర్లాండ్ లాంటి దేశాల ప్రతినిధులు వాటిలో కొన్నిటిని తమ మ్యూజియంలలో భద్రపరుస్తామని ముందుకు వచ్చారు. అయితే ఇది భారతదేశ సంపద, ఇవి భారతదేశంలోనే ప్రదర్శనగా కొనసాగాలని, ఆ ప్రతిపాదనను తిరుమలరావు ఒప్పుకోలేదు. ఈ పురా కళా సామాగ్రి విశిష్టతను గమనించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడైనా 'ఆద్యకళ' పరిరక్షణ పట్ల తగిన నిర్ణయం తీసుకోవాలి.

**-బద్రి నర్సన్ 9440128169**

## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు,ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

**మీ రచనలు పంపాల్సిన చిరునామా:**
mahaapatrika@gmail.com
whatsapp: 74369 39999

# రైతునేస్తం పురస్కారాలు 2025

'రైతునేస్తం' 21వ వార్షికోత్సవ సందర్భంగా వ్యవసాయ రంగానికి జీవితాంతం సేవలందించిన ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త స్వర్గీయ 'పద్మశ్రీ' డా.ఐ.వి.సుబ్బారావు పేరిట 'రైతునేస్తం పురస్కారాలు' వ్యవసాయ, అనుబంధ రంగాలలో విశేష ప్రతిభ కనపరచిన శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు, విస్తరణ అధికారులను అవార్డులతో ఘనంగా సత్కరించనుంది. ఈ కార్యక్రమం 2025 అక్టోబర్ 26వ తేదీ ఆదివారం ఉదయం 11:00 గం.ల నుండి స్వర్ణ భారత్ ట్రస్ట్, ముచ్చింతల్, శంషాబాద్, హైదరాబాద్ నందు భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా ' ముప్పవరపు ఫౌండేషన్', 'రైతునేస్తం'ల సంయుక్త నిర్వహణలో జరుగనుందని పద్మశ్రీ పురస్కార గ్రహీత, రైతునేస్తం ఎడిటర్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. రైతునేస్తం' పత్రిక పిలుపుకు రెండు తెలుగు రాష్ట్రాలలోని శాస్త్రవేత్తలు, రైతులు, విస్తరణ అధికారుల నుండి అనూహ్య స్పందన లభించింది. ఇందులో 'రైతునేస్తం పురస్కారాలు 2025'కు ఎంపికైన జాబితా...

### పురస్కార గ్రహీతలు

'జీవన సాఫల్య' పురస్కారం: ప్రొ. కొసరాజు చంద్రశేఖరావు, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, ఆంధ్రప్రదేశ్ 'భూమిరత్న' బిరుదు ప్రదానం: ఎం. సునీల్ కుమార్, 'భూమి' హక్కుల కార్యకర్త, తెలంగాణ 'కృషిరత్న' బిరుదు ప్రదానం: జేపీసీఎస్ రావు, ముఖ్య కార్యనిర్వహణకారి, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర ఔషధ మొక్కల బోర్డు

### రైతు విభాగం

- అడపా లక్ష్మి, నిట్టమామిడిపాలెం, గూడెం కొత్త వీధి మం||, అల్లూరి సీతారామరాజు జిల్లా
- నలువాల సుధాకర్, పెర్కపల్లి, సుల్తానాబాద్ మం||, పెద్దపల్లి జిల్లా.
- కెంద్రె బాలాజి, ధనోర గ్రా||, కెరమెరి మం||, కొమరం భీం అసిఫాబాద్ జిల్లా
- చదరం నూకా రత్నం, గణపర్తి, మునగపాక మం||, అనకాపల్లి జిల్లా
- తంగెడంచు రాఘవేందర్ రెడ్డి, పెబ్బేరు, వనపర్తి జిల్లా
- నాదెండ్ల ధనుంజయరావు, వట్టిచెరుకూరు మం||, గుంటూరు జిల్లా
- జక్కుల తిరుపతి, నాగపర్తి, చేర్యాల మం||, సిద్ధిపేట జిల్లా
- కొత్తపల్లి నాగేశ్వరరావు, నాగిరెడ్డిపాలెం, బెల్లంకొండ మం||, పల్నాడు జిల్లా
- పిట్టల శ్రీశైలం, అంకుషాపూర్, ఘట్‌కేసర్ మం, మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా
- ఎన్. కృష్ణమోహన రెడ్డి, గార్లదిన్నె, పెద్దపప్పూరు మం||, అనంతపురం జిల్లా
- రావిచెట్టు సుజాతాదేవి, తీగలతండ, చిలపూరు గుట్ట మం||, జనగాం జిల్లా
- ఓ. రంగారావు, గన్నవరం, కృష్ణా జిల్లా

### శాస్త్రవేత్తల విభాగం

- డా. ఎం. ముత్తారావు, ప్రొఫెసర్ అండ్ యూనివర్సిటీ హెడ్, పశుపరిశోధన స్థానం, ఎస్వీవీయూ, లాం, గుంటూరు
- డా. రాపోలు మహేందర్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్త & హెడ్, అగ్రానమి విభాగం,, రాజేంద్రనగర్, హైదరాబాద్
- డా. సి. వెంకటరమణ, ప్రాంతీయ ఉద్యాన పరిశోధన స్థానం, లాం, గుంటూరు, డా. వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం
- డా. కె. శ్రీనివాస్ కుమార్, సీనియర్ ప్రొఫెసర్ & యూనివర్సిటీ హెడ్ (ఐఆర్ డీఈ), వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్
- డా. ఎం.ఎస్. చైతన్యకుమారి, ప్రొఫెసర్ & యూనివర్సిటీ హెడ్, కమ్యూనిటీ సైన్స్ కళాశాల, , లాం, గుంటూరు.
- డా. జి. ప్రసాద్ బాబు, సీనియర్ సైంటిస్ట్ & హెడ్, ఐసీఏఆర్, కందుకూరు, నెల్లూరు జిల్లా
- డా. సురేష్ రాథోడ్, అసోసియేట్ డీన్, డెయిరీ టెక్నాలజీ కళాశాల, కామారెడ్డి.
- డా. అంగిరేకుల సాంబయ్య, ప్రధాన శాస్త్రవేత్త (వ్యవసాయ ఇంజనీరింగ్), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, లాం, గుంటూరు
- డా. ఎం. రాజశేఖర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఎంటమాలజీ), వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్.
- డా. ఎ. దేవివరప్రసాద్ రెడ్డి, సైంటిస్ట్ (ఫిషరీస్), , వెంకటరామన్నగూడెం, డా. వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం
- డా. జక్కుల విజయ్, శాస్త్రవేత్త , జమ్మికుంట, కరీంనగర్ జిల్లా.
- డా. వి. సత్య ప్రియ లలిత, ప్రధాన శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) & హెడ్, ఏఆర్ఎస్, ఘంటశాల, కృష్ణా జిల్లా

### నూతన ఆవిష్కరణ విభాగం

- వి. లక్ష్మానాయక్, చీఫ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ ఆఫీసర్, రైతు సాధికార సమితి, అనంతపురం
- ఆలపాటి రామచంద్ర ప్రసాద్, ఆళ్ళపల్లి, దమ్మపేట మం||, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
- కొడిముంజ ప్రవీణ్‌కుమార్, జిలేళ్ళ, తంగళ్ళపల్లి మం||, రాజన్న సిరిసిల్ల జిల్లా
- దండు సత్యనారాయణరాజు, కొత్తపేట, అంబేద్కర్ కోనసీమ జిల్లా
- నల్లబోతు వేణుగోపాల్, ముండ్లమూరు, ప్రకాశం జిల్లా

### విస్తరణ విభాగం

- డా. మెతుకు దేవేందర్ రెడ్డి, డైరెక్టర్, డా. రామానాయుడు విజ్ఞాన జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ , తునికి, మెదక్ జిల్లా
- డా. టి. వెంకట రమణారావు, విశ్రాంత ఆచార్యులు, గుంటూరు
- డా.జి.వి. రమేష్, సంయుక్త సంచాలకులు, జిల్లా పశువైద్య & పశుసంవర్ధక శాఖ, నల్గొండ.
- కంచర్ల ప్రకాశ్, రీజనల్ టెక్నికల్ ఆఫీసర్, రైతు సాధికార సంస్థ, విజయనగరం జిల్లా
- జినుగు మరియన్న, జిల్లా ఉద్యాన & పట్టు పరిశ్రమ అధికారి, మహబూబాబాద్ జిల్లా
- వాగోలు సుభాషిణి, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్, రైతు సాధికార సంస్థ, ఒంగోలు, ప్రకాశం జిల్లా
- డా.ఆకుల వేణు, ఉద్యాన అధికారి, వైరా డివిజన్, ఖమ్మం జిల్లా
- డా. మాదిన ప్రసాదరావు, సహాయ సంచాలకులు, పశుసంవర్ధక శాఖ, విశాఖపట్నం జిల్లా
- డా. ఆర్. అపర్ణ, సహాయ సంచాలకులు, పశుసంవర్ధక శాఖ, దుగ్గిరాల, గుంటూరు జిల్లా
- టి. నాగార్జున్, వ్యవసాయ విస్తరణ అధికారి, తొగుట, సిద్ధిపేట జిల్లా.
- డా. ఎం. శ్రీనివాసుల రెడ్డి, సహాయ సంచాలకులు, గొర్రెల పెంపకదారుల శిక్షణా కేంద్రం, డి.హుస్సేనాపురం, నంద్యాల జిల్లా.
- బుద్ధవరపు నాగేశ్వరరావు, గ్రామీణ పశువైద్యశాల, చింతపల్లిపాడు, వట్టిచెరుకూరు మం, గుంటూరు జిల్లా

# అమెరికా డాలర్‌కు ముప్పు



ప్రపంచాన్నిటారిఫ్ లతో గందరగోళంలో పడేస్తున్న ట్రంప్ తన తిక్క పనులతో ఇపుడు డాలర్కు కూడా ముప్పు తెస్తున్నాడన్న ప్రచారం జరుగుతోంది. ఈ ఏడాది ప్రపంచంలోని పలు దేశాలపై సుంకాలు విధించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు అమెరికా కరెన్సీపై ఆందోళన చెందుతున్నారు. అగ్రరాజ్యం అమెరికాకు చెందిన కరెన్సీ డాలర్‌కు వ్యతిరేకంగా పెద్ద కుట్ర జరుగుతోందనిపిస్తోంది, దీని వెనుక బ్రిక్స్ దేశాలు ఉన్నాయని మరోసారి ఆరోపించారు. బ్రిక్స్ దేశాల కూటమిని అమెరికా డాలర్‌పై దాడిగా అభివర్ణించారు. బ్రిక్స్ లో చేరాలనుకునే దేశాలపై టారిఫ్ విధిస్తామని తాను బెదిరించానని, ఆ తర్వాత కొన్ని దేశాలు వెనక్కి తగ్గారని పేర్కొన్నారు. బ్రిక్స్ కూటమిలో బ్రెజిల్, రష్యా, భారతదేశం , చైనా, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఉన్నాయి. ఈ దేశాలు అమెరికా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని ట్రంప్ అన్నారు. అందుకే ఆయన ఈ దేశాలపై అదనపు సుంకాలు విధించేందుకు సిద్ధమని హెచ్చరించారు. మరోవైపు, బ్రిక్స్ దేశాలు ట్రంప్ ఏకపక్షంగా విధిస్తున్న సుంకాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. డాలర్ మారకంతో ఆధారపడి ఉన్నందున ప్రపంచ ఆర్థిక వ్యవస్థలపై, వ్యాపారాలపై టారిఫ్ కచ్చితంగా ప్రభావం చూపుతుంది. అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మైలీతో ద్వైపాక్షిక సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ.. డాలర్ విలువపై తన వైఖరి స్పష్టం చేశారు. డాలర్ కాకుండా వేరే కరెన్సీతో లావాదేవీలు చేసే వారి కంటే డాలర్ లో బిజినెస్ చేసే వారికి ఎక్కువ లాభాలు, ప్రయోజనాలు ఉంటాయన్నారు. డాలర్ కు వ్యతిరేకంగా ఉండే వారిపై మరింత కఠినంగా వ్యవహరిస్తా అన్నారు. టారిఫ్ లు విధించి అమెరికాతో పాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడేలా చేస్తున్నా డొనాల్డ్ ట్రంప్ తగ్గడం లేదు. బ్రిక్స్ కూటమిలో చేరాలనుకునే దేశాలన్నింటికీ ఓ విషయం చెప్పాను మీ దేశంపై భారీ సుంకాలు విధిస్తాము. తరువాత వాటికి నాది బాధ్యత కాదు. ఆలోచించుకోవాలని హెచ్చరించడంతో బ్రిక్స్ కూటమిలో చేరాలనుకున్న ప్రతి ఒక్కరూ వెనక్కి తగ్గారు.

బ్రిక్స్ కూటమి డాలర్‌కు ప్రత్యామ్నాయంగా కొత్త కరెన్సీ తేవాలని చూస్తుంది. ఇది కచ్చితంగా అమెరికా కరెన్సీపై జరిగే దాడి. ఏ దేశమైనా బ్రిక్స్ లో చేరాలనుకుంటే, అమెరికాకు వచ్చే మీ ఎగుమతులపై భారీ సుంకాలు విధిస్తానని ట్రంప్ అన్నారు. గత నెలలో బ్రిక్స్ దేశాలు తమ ప్రకటనలో సుంకాలలో ఇలాంటి భారీ పెరుగుదల, అధిక టారిఫ్ లు ప్రపంచ వాణిజ్యానికి ముప్పుగా మారతాయన్నారు. ట్రంప్ పరిపాలన ఒక్క ఏడాదిలోనే పలు దేశాలపై ప్రతికూల ప్రభావం చూపారు. ఆయన పదవీకాలం ముగిసేవరకూ పరిస్థితిలో మార్పు వస్తుందని ఈ కూటమి భావించడం లేదు. ముఖ్యంగా భారత్ మీద ట్రంప్ మండిపడుతూనే.. మై గుడ్ ఫ్రెండ్ మోదీ అని అంటున్నారు. రష్యా, చైనాలపై సైతం టారిఫ్ వార్ కొనసాగిస్తున్నారు. రష్యా నుంచి ముడి చమురు కొనొద్దని భారత్ మీద 25 శాతం టారిఫ్ వేశారు. భారతదేశం నుండి దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై అమెరికా 25 శాతం టారిఫ్ విధించింది. రష్యా నుండి అమెరికా కూడా ముడి చమురును కొంటున్నా.. భారత్ పై మాత్రం ఈ కొనుగోలు సాకుగా చూపి అదనంగా 25 శాతం టారిఫ్ విధించారు. ఓవరాల్ గా చూస్తే భారత్ ఎగుమతులపై మొత్తం 50 శాతం టారిఫ్ కొనసాగుతోంది. హెచ్ 1బీ వీసాలకు లక్ష డాలర్లు చేసి భారతదేశం నుంచి అమెరికాకు టెకీలు రాకుండా చర్యలు చేపట్టారు. ఇపుడు రష్యా నుండి భారత్ చమురు కొనదంటూ కొత్త ప్రచారాలు చేస్తున్నారు. ట్రంప్ చేస్తున్న చర్యలతో అమెరికా ఆర్థికపరిస్థితి మెరుగుపడకపోగా, డౌన్ అవుతుందని నిపుణులు అంటున్నారు.

# జపాన్‌లో లాక్ డౌన్.. కలవరపెడుతున్న మహమ్మారి

లాక్‌డౌన్.. కరోనా వైరస్ కారణంగా భారతదేశంతోపాటు పలు దేశాల్లో అనేక నెలలు లాక్ డౌన్ విధించాల్సి వచ్చింది. ఇపుడు మరో మహమ్మారి, లాక్ డౌన్ లు పలుదేశాలను కలవరపెడుతున్నాయి. జపాన్ దేశంలో ఇటీవల భారీ సంఖ్యలో ఇన్‌ఫ్లుఎంజా కేసులు పెరుగుతూ వచ్చాయి. దీంతో అధికారులు దేశవ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించారు. వైరస్ శరవేగంగా వ్యాపిస్తుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు హెచ్చరికలు జారీ చేశారు. అంతేకాదు.. జపాన్‌లోని ఆస్పత్రిలన్నీ రోగులతో నిండిపోయాయి. పాఠశాలలు, మార్కెట్లు మూసివేయాల్సిన పరిస్థితులు తలెత్తాయి. ఈ ఫ్లూ వ్యాప్తి జపాన్ దేశంలో కోవిడ్ 19 తరహా పరిస్థితులను తలపిస్తోంది. ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలు, దీర్ఘకాలిక అనారోగ్యాలతో ఇబ్బంది పడుతున్న వారు ఫ్లూ బారిన పడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే దేశంలోని పలు ప్రాంతాల్లో లాక్‌డౌన్ విధించేందుకు జపాన్ ప్రభుత్వం సిద్ధమవుతోన్నట్లు తెలుస్తోంది. మలేషియా దేశంలోనూ ఇన్‌ఫ్లుఎంజా



వ్యాప్తి వేగంగా పెరుగుతోంది. దీంతో మలేషియా అధికారులు పాఠశాలలను మూసివేయాలని, దేశవ్యాప్తంగా విద్యార్థులు ఒక వారం పాటు ఇంట్లోనే ఉండాలని ఆదేశించారు. విద్యామంత్రిత్వ శాఖ అధికారులు ఈ మేరకు ప్రకటన చేసినట్లు సౌత్ చైనా మార్నింగ్ పోస్టు తన నివేదికలో పేర్కొంది. ఇన్‌ఫ్లుఎంజా కేసుల సంఖ్య గణనీయంగా పెరిగిన నేపథ్యంలో జాతీయ సిజిల్ పెలాజరన్ మలేషియా పరీక్షల సమయంకు కొన్ని వారాల ముందు పాఠశాలలు మూసివేయాలని ఆదేశించారు. జిల్లా ఆరోగ్య అధికారుల సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు విద్యామంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్ మొహమ్మద్ అజామ్ అహ్మద్ తెలిపారు. వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి అనేక పాఠశాలలను మూసివేయాలని ఆదేశించడం జరిగిందని ఆయన చెప్పారు. ఇప్పటి వరకు పలు ప్రాంతాల్లో పాఠశాలలు మూసివేయడం వల్ల దాదాపు 6వేల మంది విద్యార్థులు ఇళ్లకే పరిమితం అయ్యారని చెప్పారు. ఇన్‌ఫ్లుఎంజా మహమ్మారి సోకిన వారు ఐదు నుండి ఏడు రోజులు స్వీయ నిర్బంధాన్ని పాటించాలని ఆరోగ్య అధికారులు సూచించారు. కొవిడ్ 19 మహమ్మారి ప్రారంభమైనప్పటి నుండి మలేషియా ఎదుర్కొన్న అత్యంత విస్తృతమైన వైరల్ వ్యాప్తిలలో ప్రస్తుత ఇన్‌ఫ్లుఎంజా వేవ్ ఒకటని అక్కడి అధికారులు చెబుతున్నారు. దీంతో మలేషియా అంతటా పాఠశాలలను కొద్ది రోజులు మూసివేయడం ద్వారా వైరస్ వ్యాప్తిని అరికట్టాలని చర్యలు చేపట్టారు. పరిస్థితి విషమించితే మిగిలిన రంగాలకు కూడా హాలిడే ప్రకటించేందుకు మలేషియా ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

# పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదగా నడుచుకోవాలి

## ఫిర్యాదుదారులు పోలీస్ స్టేషన్లకు ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేయాలి

## అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెంచాలి : డిసిపి



**ఆమనగల్లు, మహా :** పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో సిబ్బంది మర్యాదగా వ్యవహరించాలని మహేశ్వరం జోన్ డిసిపి సునీతా రెడ్డి సూచించారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. గురువారం మాడ్గుల పోలీస్ స్టేషను సందర్శించి తనిఖీ చేశారు అనంతరం రికార్డ్స్, క్రైమ్ రేట్ల వివరాలు,పోలీసు సిబ్బంది సంక్షేమాలను సిఐ వేణుగోపాల్ ను అడిగి తెలుసు కున్నారు. నేరాలను అదుపు చేసేందుకు పోలీస్ శాఖ అన్నిచర్యలు తీసుకుంటుందన్నారు. ప్రధానంగా నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని,పటిష్ఠ నిఘా ఉన్న ప్రాంతాలలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఏ సమస్య ఉన్నా పోలీస్ స్టేషన్లకు ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేయాలని, సత్వర న్యాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించామన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించి సైబర్ నేరాల కట్టడానికి కృషిచేయాలన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా తగు సూచనలు, ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని డిసిపి సూచించారు. ప్రజల రక్షణే ధ్యేయంగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి సాధ్యమైనంత త్వరగా వారి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు, బెట్టింగ్,ఆన్‌లైన్ గేమ్స్,తదితర వాటిపై నిఘా పెంచాలని ప్రజలకు శాంతి భద్రత కల్పించడంలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించాలని సూచించారు..ఈ కార్యక్రమంలో ఎస్ఐ మహేందర్ సిబ్బంది పాల్గొన్నారు.

# సప్తగిరి ఫాంహౌస్‌లో రేవ్ పార్టీ భగ్నం చేసిన పోలీసులు

- పట్నం నుంచి పల్లెకు సోకిన రేవ్ పార్టీ
- పోలీసుల అదుపులో 25 మంది యువతి, యువకులు
- రెండు లక్షల నగదు, కార్లు, మొబైల్స్ స్వాధీనం
- లింగంపల్లి గ్రామం సప్తగిరి ఫాంహౌస్‌లో దారుణం
- ఫామ్ హౌస్ యజమాని ఆధ్వర్యంలో పార్టీ నిర్వహణ





**రంగారెడ్డి జిల్లా మహా:** లింగంపల్లి గ్రామంలోని సప్తగిరి ఫామ్ హౌస్లో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న రేవ్ పార్టీని భగ్నం చేసిన మంచాల పోలీసులు. రంగారెడ్డి జిల్లా మంచాల మండల పరిధి లోని, లింగంపల్లి గ్రామంలో గుట్టు చప్పుడు కాకుండా సప్తగిరి ఫాంహౌస్లో రేవ్ పార్టీని నిర్వహిస్తునట్లు పక్క అందుకున్న పోలీసులు, ఫామ్ హౌస్ పై దాడి చేసిన ఘటనలో 25 మంది యువతి, యువకులను అదుపు లోకి తీసుకోని వారి వద్ద నుంచి నగదు, కార్లను, సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన మంచాల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.

**సిఐ మధు తెలిపిన వివరాలు ప్రకారం..**

రంగారెడ్డి జిల్లా, మంచాల మండలం, లింగంపల్లి గ్రామంలో బుధవారం రాత్రి కిట్టిపార్టీ పేరుతో సప్తగిరి ఫాంహౌస్లో ఎలాంటి అనుమతులు లేకుండా, మద్యం సేవిస్తూ, అమ్మాయిలతో అర్ధనగ్న నృత్యాలు చేయిస్తూ రేవ్ పార్టీని నిర్వహించారు. ఈ పార్టీలో నగరానికి చెందిన 25 మంది యువతి, యువకులు పాల్గొన్నట్లు పోలీసులు వెల్లడించారు. సప్తగిరి ఫామ్ హౌస్ యజమాని రుద్రశెట్టి సప్తగిరి ఆధ్వర్యంలో రేవ్ పార్టీ జరుగుతున్నట్లు పక్క సమాచారంతో మంచాల ఎస్ఐ నాగేశ్వర్ రావు, తన బృందంతో రంగ ప్రవేశం చేసి, ఫాంహౌస్ పై దాడి నిర్వహించన దాడిలో 8 మంది మహిళలు,17మంది యువకులను, నిర్వాహకులను అదుపులోకి తీసుకన్నారు. ఈ ఘటనలో నిందితుల నుండి రెండు లక్షల 45వేల రూపాయలను, 11కార్లు, 25 మొబైల్ ఫోన్లు, మద్యం సీసాలు,18 బీర్ సీసాలు, స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిని మంచాల పోలీస్ స్టేషన్ కు తరలించి, వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు, సిఐ సర్కిల్ ఇన్ స్పెక్టర్ మధు తెలిపారు.

**పట్నం నుంచి పల్లెకు సోకిన రేవ్ పార్టీ....**

ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాలలో ఇప్పటివరకు చూడనటువంటి, ఇంతటి దారుణమైన రేవు పార్టీ జరగడం ఇదే తొలిసారి... ఫామ్ హౌస్ నిర్వాహకులు వారి ఆధ్వర్యంలో యువతి యువకులతో అర్ధ నగ్న ముత్యాలను చేయిస్తూ పార్టీలు చేసుకోవడం దారుణం. పల్లెల్లో ఇలాంటి దారుణమైన పార్టీలు చేయడంపై పలువురు విమర్శిస్తున్నారు. నిర్వాహకులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు తెలిపారు.

# అక్రమ ఇసుక ఫిల్టర్ల ధ్వంసం



**ఆమనగల్లు, మహా :** తలకొండపల్లి మండలంలోని చుక్కాపూర్ గ్రామ శివారులో అక్రమంగా నిర్వహిస్తున్న కృత్రిమ ఇసుక ఫిల్టర్లను రెవెన్యూ అధికారులు మరియు పోలీసుల అధికారుల ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించారు. వ్యాపారులు ఇసుక ఫిల్టర్ల ద్వారా కృత్రిమ ఇసుకను తయారు చేస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్సై ఎ.శ్రీకాంత్, ఆర్ఐ శ్రావణ్, పోలీస్ సిబ్బంది మరియు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



గుడ్లు, మాంసం ఉత్పత్తితో పాటు గ్రామీణ

# ప్రజలకు ఉపాధి అవకాశాలు

## విస్తరణ సంచాలకులు డా,ఎం, కిషన్ కూమార్

**రాజేంద్రనగర్, మహా :** రాజేంద్రనగర్ పి.వి. నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయంలో కోళ్ల పరిశోధనా కేంద్రం, రాజశ్రీ కోళ్లు పెంపకంతో గ్రామీణ ప్రజలకు ఉపాధి అనే అంశంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం డా కృష్ణ దైద, డా,అనిల్, పవన్, ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విస్తరణ సంచాలకులు డా ఎం కిషన్ కుమార్ , కళాశాల అసోసియేట్ డీన్ డా ఎం మధురీ హాజరయ్యారు. రైతులకు కోళ్ల పెంపకం ద్వారా ఉపాధి అవకాశాలు మరియు గ్రామీణ మహిళల ఆర్థిక అభివృద్ధిపై సూచనలు సలహాలు ఇచ్చారు. డా డి అనిల్ పవన్ ప్రధాన శాస్త్రవేత్త, గుడ్ల నాణ్యత, రంగు గుడ్ల ఉత్పత్తి లో ప్రాముఖ్యతపై విశ్లేషణాత్మకంగా శిక్షణ ఇచ్చారు డా, రామకృష్ణ , అసోసియేట్ ప్రొఫెసర్ (అగ్రానమీ), పెరటికోళ్ల పెంపకంలో సంప్రదాయేతర వినియోగంపై ప్రయోగాత్మక సందేహాల నివృత్తి చేశారు. డా వినయశ్రీ , అసోసియేట్ ప్రొఫెసర్, సాంప్రదాయ పద్ధతుల ద్వారా నాటు కోళ్లు పెంపకంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన సుమారు 60 మంది రైతులు రాజశ్రీ కోళ్లు పెంపకం ద్వారా గుడ్లు, మాంసం ఉత్పత్తితో పాటు గ్రామీణ ఉపాధి అవకాశాల విస్తరణపై అవగాహన పొందారు. డా.కృష్ణ దైద, ప్రధాన శాస్త్రవేత్త మాట్లాడుతూ, రైతులు ఈ శిక్షణ ద్వారా పొందిన జ్ఞానాన్ని ఉపయోగించి కోళ్ల పెంపకాన్ని వ్యవస్థీకృత వ్యాపార సరళిలో అభివృద్ధి చేయాలని, దానివల్ల గ్రామీణ స్థాయిలో స్థిరమైన ఆదాయ వనరులు ఏర్పడతాయని సూచించారు.

# గర్భిణీ స్త్రీలు పోషకాహారం తీసుకోవాలి

## జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**యాదాద్రి భువనగిరి, మహా:** గర్భిణీలు మంచి పోషకాహారం తీసుకొని సంపూర్ణ ఆరోగ్య వంతంగా వుండాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నపాటి వ్యాయామం చేస్తే సాధారణ సుఖ ప్రసవం అవుతారని,డెలివరీలు ప్రభుత్వ దవాఖానలో చేయించుకోవాలని గర్భిణీలకు తెలియజేశారు. ప్రతి అంగన్వాడీ టీచర్ తన కేంద్రంలో ప్రీ స్కూల్ పిల్లల హాజరు శాతం పెంచాలని నిబద్ధతతో పని చేయాలని త్వరలో అంగన్వాడి టీచర్లుకు ప్రాజెక్ట్ స్థాయిలో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తానని అనంతరం గర్భిణీలకు సామూహిక సీమంతాలు మరియు 6 నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన చేశారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ భాస్కర్ రావు మాట్లాడుతూ. బరువు తక్కువ ఉన్న పిల్లలకు బాలమృతం ప్లస్ ఇస్తున్నారని త్వరలో ప్రాథమిక పాఠశాలలకు దగ్గర్లో ఉన్న అంగన్వాడి కేంద్రాలను ప్రాథమిక పాఠశాలలలో కలుపుతామని నిబద్ధతతో పని చేయాలని తెలియజేశారు. అనంతరం జిల్లా గ్రంథాలయ చైర్మెన్ అవేజ్ చిస్తీ మాట్లాడుతూ. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు సమర్థవంతంగా క్షేత్ర స్థాయిలో అమలు చేయాలని. అంగన్వాడి కేంద్రాల్లో పోషణ మాసం కార్యక్రమాలు అన్ని అంగన్వాడి కేంద్రాలలో బాగా చేశారని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారి మనోహర్,జిల్లా డి ఆర్ డి ఓ, నాగిరెడ్డి,డిప్యూటీ డి ఎం ఎం హెచ్ ఓ. యశోద,జిల్లా వైద్యశాఖ అడిషనల్ డైరెక్టర్ ప్రశాంత్ రెడ్డి, సిడిపిఓలు,సూపర్వైజర్లు, జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బంది. పోషణ అభియాన్ టీం అంగన్వాడి టీచర్లు, గర్భిణీలు,. బాలింతలు పాల్గొన్నారు



# ఈనెల 18న బంద్‌ను జయప్రదం చేయండి

**వలిగొండ, మహా :** ఈనెల 18న బీసీల బందును విజయవంతం చేయాలని గురువారం వలిగొండ మండల కేంద్రంలో బీసీ సంఘం అధ్యక్షులు సాయిని యాదగిరి అధ్యక్షతన అఖిలపక్షం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది ఈ సందర్భంగా సాయిని యాదగిరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ అమలుతోనే ఎన్నికలకు వెళ్లాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి చెరుకు శివయ్య బోళ్ల శ్రీనివాస్ సిర్పంగి స్వామి. బొడిగె సుదర్శన్ కాసుల వెంకన్న కొండూరు భాస్కర్ గర్దాసు నరసింహ సుక్క శ్రీకాంత్ చిలుగురి సత్తిరెడ్డి. దుబ్బ దానయ్య సాయి కుమార్ మహేష్ బత్తిని బిక్షపతి పల్లెర్ల రామచందర్ శీలం స్వామి తదితరులు పాల్గొన్నారు

# ట్రాఫిక్ నియమాలు పాటించండి

## విద్యార్థులకు ట్రాఫిక్ అవగాహన సదస్సులో పాల్గొన్న.. ట్రాఫిక్ ఏసిపి నాగభూషణం



**రాజేంద్రనగర్, మహా :** భావి భారత పౌరులైన విద్యార్థులకు ట్రాఫిక్ పై అవగాహన కల్పించడంత పాటు వారిని ట్రాఫిక్ విధులలో భాగస్వామ్యం చేయాలనే ఉన్నతాధికారుల ఆదేశాలతో శంషాబాద్ మండలం పాలమాకుల్ గ్రామంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో శంషాబాద్ ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్రాఫిక్ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసిపి పి నాగభూషణం, శంషాబాద్ ట్రాఫిక్ సిఐ ప్రమోద్ కుమార్లు పాల్గొన్నారు. అందులో భాగంగా ట్రాఫిక్ నియమాలైన ఎడమ చేతి వైపు నడవడం హెల్మెట్ ధరించాలని తల్లిదండ్రులను ప్రోత్సహించటం, త్రాగి వాహనాలు నడపొద్దని తల్లిదండ్రులకు చెప్పాలని మైనర్లు వాహనాలు నడుపొద్దని విద్యార్థులకు దశ నిర్దేశం చేశారు. ట్రాఫిక్ అవగాహనలో భాగంగా విద్యార్థులను నేషనల్ హైవే పాలమాకుల రోడ్డుపై విద్యార్థులకు ట్రాఫిక్ విధులపై అవగాహన కల్పిస్తూ వారితో ట్రాఫిక్ డ్యూటీ ఎలా ఆపాలి, తర్వాత జీబ్రా క్రాసింగ్ మీద పాదాచార్యులు వెళ్తున్నప్పుడు వాహనాలు నిల్పటం అదేవిధంగా ప్రయాణిస్తున్న వాహనాలను పై ట్యాబ్ ద్వారా ఫోటో తీసి చలాన్ జనరేట్ చేయటం లాంటి విషయాలపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్ రావు, అధ్యాపకులు, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాలలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలోని అన్ని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2025 26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో గురుకుల ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థినీ, విద్యార్థులు, గతంలో దరఖాస్తు చేసుకున్న వారితో పాటు, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అక్టోబర్ 17 సాయంత్రం 5 గంటల లోగా లక్షెట్టిపేట (బాలికల) గురుకుల విద్యాలయంలో దరఖాస్తులు సమమర్పించాలని వెల్లడించారు. కుల ధ్రువీకరణ పత్రంతో పాటు ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులు హాల్ టికెట్, ర్యాంకు ధ్రువీకరణ పత్రాల నకలు ప్రతులు జత పరచాలని సూచించారు. లక్షెట్టిపేట, చెన్నూరు, మందమర్రి, బెల్లంపల్లి (బాలికలు), బెల్లంపల్లి, కాసిపేట, కోటపల్లి, మంచిర్యాల, జైపూర్ (బాలుర) సాంఘిక సంక్షేమ గురుకులాలలో ఖాళీగా ఉన్న సీట్లను ఈ నెల 18న లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేసి, భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. బాలికల గురుకులాలలోని 6వ తరగతిలో ఎస్ సి 6, ఎస్టి 2, బీసీ 3, జనరల్ 3, మైనారిటీ 2 సీట్లు ఉన్నాయని, 7వ తరగతిలో బీ సి 5 సీట్లు, 8 వ తరగతిలో ఎస్ సి 4, ఎస్టి 1, బీసీ 10, జనరల్ 6, మైనారిటీ 5, 9వ తరగతి లో ఎస్ సి 3, ఎస్టి 4, బీసీ 4, జనరల్ 5, మైనారిటీ 3 సీట్లు ఉన్నాయని తెలిపారు. బాలుర గురుకులాలలో 5వ తరగతిలో, ఎస్టి 3, జనరల్ 3, మైనారిటీ 2 సీట్లు, 6వ తరగతిలో ఎస్ సి 9, ఎస్టి 5, జనరల్ 1, మైనారిటీ 6 సీట్లు, 7వ తరగతిలో ఎస్ సి 5 సీట్లు, 8వ తరగతిలో ఎస్ సి 8, బీసీ 8, జనరల్ 6, మైనారిటీ 8, 9వ తరగతి లో ఎస్ సి 11, బీసీ 4, ఓసీ 7, మైనారిటీ 5 సీట్లు ఉన్నాయని తెలిపారు.

# అక్టోబర్ 18 రాష్ట్ర బందుకు ప్రైవేట్ విద్యాసంస్థల మద్దతు

**మంచిర్యాల, మహా :** అక్టోబర్ 18 నాడు బీసీ జెఎసిలు తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త బందుకు మంచిర్యాల జిల్లా ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు మద్దతు ఇస్తున్నట్లు గురువారం వెల్లడించారు. అగ్రవర్ణలు చేస్తున్న కుట్రలో భాగంగా బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ హైకోర్టులో వ్యతిరేకంగా కేసు వేయటం వల్ల, తెలంగాణ హైకోర్టు స్టే ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు వారు వెల్లడించారు. బీసీ జెఎసి రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన బందులో మంచిర్యాల జిల్లాలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంచిర్యాల జిల్లా ప్రవేట్ విద్యాసంస్థలు బంద్ కీ సంపూర్ణ మద్దతు తెలపటం పట్ల విద్యార్థి సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కామారెడ్డి డిక్లరేషన్లో భాగంగా బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడని అగ్రవర్ణాలు జిర్ణించుకోలేక,ప్రతి పార్టీలో ఉన్న అగ్రవర్ణా నాయకులు అందరూ ఒక్కటై ఒక్క వ్యక్తిని ముందు పెట్టి హైకోర్టులో కేసు వేయడం వల్ల కోర్టు స్టే ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ స్టేని వ్యతిరేకిస్తూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న బీసీ సంఘాలు అందరు ఒక్కటై ఈ నేల 18 న సంపూర్ణ బందును ప్రకటించటం జరిగిందని తెలిపారు.

# అదుపు తప్పిన ట్రావెల్స్ బస్సు డివేడర్‌ను ఢీకొడుతూ... బోలేరో వాహనాన్ని ఢీ కోట్టింది.. పలువురికి గాయాలు



**రాజేంద్రనగర్ మహా ;** హిమాయత్ సాగర్ ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అతివేగంగా వస్తూ అదుపుతప్పి డివైడర్ను ఢీకొడుతూ బొలెరో వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. బస్సులో ఉన్న పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. గచ్చిబౌలి నుంచి శంషాబాద్ వైపు అతివేగంగా వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి బస్సు డ్రైవర్ బస్సుని కంట్రోల్ చేసే ప్రయత్నంలో డివైడర్ను ఢీ కొట్టితూ శంషాబాద్ నుంచి గచ్చిబౌలి వెళ్తున్న బొలెరో వాహనాన్ని ఢీకొట్టడంతో బస్సులోని పలువురి ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. రాజేంద్రనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయాలైన పలువురుని ఆసుపత్రికి తరలించారు. బస్సు, బొలెరో వాహనాన్ని ఓఆర్ఆర్ పై నుంచి తొలగించి ట్రాఫిక్ ని క్లియర్ చేసి ఇరువురి పై కేసు నమోదు చేశారు.



# పల్లెర్లలో మార్నింగ్ వాక్ ...

## ప్రజల సమస్యలు తెలుసుకున్న బీర్ల

**మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలం పల్లెర్ల గ్రామంలో గురువారం ఉదయం ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య(మార్నింగ్ వాక్ ) పాదయాత్ర చేసి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు పేదవాడి సొంత ఇంటి కల నేరవేర్చడమే సిఎం రేవంత్ రెడ్డి లక్ష్యమన్నారు.. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రతి గల్లీ తిరుగుతూ గ్రామస్థుల నుండి సమస్యలను తెలుసుకున్నారు వాటిని పరిష్కరించాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజలు,కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు త్వరితగతిన పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**యాదాద్రి భువనగిరి, మహా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు గురువారం నాడు యాదగిరిగిట్ట మండలం రామాజీపేట గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు.. గ్రామంలో మొత్తం ఎన్ని ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయని, నిర్మాణంలో ఉన్న ఇండ్లు ఏఏదశలో ఉన్నాయని పంచాయతీ కార్యదర్శి ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో స్లాబ్ దశ వరకు పూర్తి అయినా ఇంటిని పరిశీలించారు . ఇప్పటి వరకు రెండు బిల్లులు మీ అకౌంట్ లలో పడ్డాయా అని అడిగారు . స్లాబ్ వేసిన తరవాత ఫోటో తీసారా అని అడిగారు. మిగిలిన బిల్లులు కూడా వెంటనే వస్తాయని . మిగిలిన పనులు పూర్తి చేసి త్వరలో గృహప్రవేశం చేసుకోవాలని సూచించారు. తదనంతరం యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు గ్రామంలో మొత్తం ఎన్ని నిర్మాణంలో ఉన్నాయని నిర్మాణంలో ఉన్న అన్ని ఇండ్లకు ఇప్పటి వరకు పనులు అయినంత వరకు బిల్లులు వచ్చాయా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న కొమ్మగాని లక్ష్మీ ఇంటిని పరిశీలించారు. లక్ష్మి ని ఇప్పటివరకు అన్ని బిల్లులు వచ్చాయా అని అడిగి తెలుసుకున్నారు. మేస్త్రీ కి ఎంత డబ్బులు ఇచ్చారని ఆరా తీశారు . ఇటుక ఎక్కడ నుండి కొనుగోలు చేశారని, ఎంత రేటు కి కొనుగోలు చేశారని అడిగి తెలుసుకున్నారు. లక్ష్మి కుమారుడు రవి పుట్టుకతో దివ్యాంగుడు ఇంట్లో ఇద్దరమే ఉంటాం రోజు గడవటం కష్టం గా ఉందని చిన్న డబ్బా కొట్టు ఉందని చెప్పడంతో వెంటనే సంబంధిత బ్యాంకు అధికారులు తో మాట్లాడి వారికీ కిరాణా కొట్టు పెట్టుకోవడానికి లోన్ ఇప్పించమని ఆదేశించారు. అలాగే రవి కి కూడా బాటరీ ట్రై బండి ఇప్పిస్తా అని కలెక్టర్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రూ.2.37 కోట్ల విలువైన 1.798 కిలోల బంగారం పట్టివేత



**రాజేంద్రనగర్, మహా :** విశ్వసనీయ సమాచారం మేరకు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో గురువారం డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు పెద్ద ఎత్తున బంగారం పట్టుకున్నారు. డి ఆర్ ఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం. విశ్వసినీయ సమాచార మేరకు బంగారం స్మగ్లింగ్ పాల్పడుతున్నారన్న సమాచారం మేరకు ఎయిర్పోర్టులో నిఘా కట్టుదిట్టం చేశారు. కువైట్ నుంచి హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ మీదుగా ఎయిర్ అరేబియా ఫ్లైట్ జి 9 467 విమానంలో షార్జాకు ప్రయాణికులు వెళ్తున్నారు. విమానంలో స్మగ్లింగ్ కు పాల్పడుతున్నారని అనుమానంతో అధికారులు ప్యాసింజర్ లగేజ్ లను తనిఖీలు చేశారు. తనిఖీల్లో భాగంగా ఓ ప్రయాణికుని లగేజీలో బంగారు కడ్డీ ముక్కలను పొద్దుతిరుగుడు విత్తనాలు గల ప్లాస్టిక్ పర్సులో 24 క్యారెట్ల బంగారం 2, దాచి పెట్టారు. మరో 24 క్యారెట్ల బంగారం కడ్డీలు మరో బ్యాగేజీలో 5 కడ్డీలను తీసుకెళ్తుండగా డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు పట్టుకున్నారు. 5, మరియు 2 బంగారు కడ్డీలను అధికారులు పరిశీలించి తూకం వేశారు. వాటి బరువు 1798 గ్రాములుగా గుర్తించారు. వాటి విలువ 2 కోట్ల 37 లక్షల ఉంటుందని అంచనా వేశారు. బంగారాన్ని స్వాధీనం చేసుకున్న నిందితులను అరెస్టు చేసి కష్టమ్స్ చట్టం 1962 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిరు.

# పోషకాహారం ఆరోగ్యకరమైన జీవితం

## ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**ఆత్మకూర్ (ఎం), మహా:** పాలు ,పండ్లు ,గుడ్లుతో పటు పోషకాహరాలే ఆరోగ్యకరమైన జీవితమని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 16 వరకు పోషణ మహోత్సవాలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించబడాయని ఈ సందర్భంగా ఆత్మకూరు మండల కేంద్రంలో పోషక మాసం ఉత్సవాలను గురువారం నాడు నిర్వహించారు... ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రతి గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం జరిపించి సంప్రదాయ పద్ధతిలో చీరను గాజులను పూలను పండ్లను ఎమ్మెల్యే అందజేశారు. ఆ తర్వాత నూతనంగా జన్మించిన పిల్లలకు అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ పిల్లలు, గర్భిణులు, బాలింతలు మరియు కిశోర బాలికల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించడం, ఆరోగ్య అవగాహన పెంపొందించడం చాలా అవసరమని అన్నారు. అంగన్‌వాడీలలో మహిళలు మరియు పిల్లలకు రాగి లడ్డూలు, మిల్లెట్స్ (చిరుధాన్యాలు), పండ్లు, ఆకుకూరలు వంటివి అందించి పోషకాహారం పై వారికి అవగాహన కల్పించడంలో అంగన్వాడీ టీచర్లు కీలకంగా వ్యవహరించాలన్నారు..ఐసీడీఎస్ సిబ్బంది మరియు ఆశా వర్కర్లు తల్లిదండ్రులు, యువత, విద్యార్థులకు పోషకాహారం గురించి తెలుపాలన్నారు

# పల్లె ధావాఖాన ఆకస్మిక తనిఖీ

## కలెక్టర్ హనుమంతరావు

**ఆలేరు, మహా:** వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి ఆసుపత్రి కి వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్యం అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు గురువారం నాడు యాదగిరిగుట్ట మండలం చిన్నకందుకూరు గ్రామంలో పల్లె దవాఖానని ఆకస్మిక తనిఖీ చేశారు ప్రతి రోజు ఆసుపత్రికి ఓపిలో ఎంత మంది వస్తున్నారని ఓ. పి రిజిస్టర్ ను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే పేషెంట్లు ఏ రోగాలతో వస్తున్నారని, అడిగి తెలుసుకున్నారు.అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయ అని తెలుసుకు న్నారు. సిబ్బంది అందరూ రోజు విధులకు హాజరవుతున్నారా అని అటెండెన్స్ రిజిస్టర్ను పరిశీలించారు..గత నెలలో ఎన్ని ప్రసవాలు జరిగాయని, ఎక్కడ అయ్యాయని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు , ఈ నెలలో ఎన్ని ఈ డి డి లు ఉన్నాయని . పసి పిల్లలకు వ్యాక్సినేషన్ వేస్తున్నారా అని, ప్రతి నెల ఆ డేట్ ప్రకారం చిన్న పిల్లలకు వ్యాక్సినేషన్ వేయాలన్నారు .ఈ ఆసుపత్రిలో గత నెలలో రెండు డెలివరీ ఉంటే అవి ప్రభుత్వ ఆసుపత్రి లో జరిగాయని సిబ్బంది కలెక్టర్ కు తెలిపారు. ఈ నెల లో ఒక్క డెలివరీ డేట్ ఉందని వాళ్ళు కూడా ప్రభుత్వ ఆసుపత్రిలో చేయించుకుంటార అని కలెక్టర్ కు తెలిపారు . అనంతరం యాదగిరిగుట్ట మండలం చిన్న కందుకూరు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్.. గ్రామంలో ఎన్ని ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయని, అవి ఎంత మేరకు నిర్మాణ పనులు పూర్తి అయ్యాని, అయినంత వరకు బిల్లులు వచ్చాయా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో స్లాబ్ లెవల్ వరకు పూర్తి అయిన ఇంటిని కలెక్టర్ పరిశీలించారు. ఇప్పటి వరకు 3 దశలలో బిల్లులు వచ్చాయా అని కలెక్టర్ కు తెలిపారు. మిగిలిన పనులు కూడా వేగంగా పూర్తి చేసుకోని కొత్త ఇంటికి వెళ్ళాల అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు




## అథ్లెటిక్ క్రీడా పోటీలను ప్రారంభించిన ఎంపీ, మేయర్, కలెక్టర్



**హన్మకొండ మహా;** అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో హన్మకొండ లోని జే ఎన్ ఎస్ స్టేడియం లో నిర్వహిస్తున్న 5వ ఇండియన్ ఓపెన్ అండర్ 23 అథ్లెటిక్స్ కాంపిటీషన్ 2025 క్రీడా పోటీలను లోక్ సభ సభ్యురాలు డా.కడియం కావ్య జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ లతో కలిసి నగర మేయర్ గుండు సుధారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్ పరుగు పందెంలో విజయం సాధించిన విజేతలకు అతిథులు మెడల్స్ ను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమం లో హన్మకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు వరద రాజేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ అజీజ్ ఖాన్, జిల్లా స్పోర్ట్స్ అధికారి అశోక్, సీనియర్ అథ్లెట్ కిషన్ సి బి ఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.

# డీసీసీ అధ్యక్ష పదవికి గూడూరు దరఖాస్తు



**ఆమనగల్లు, మహా:** జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవికి కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన డిసిసి అధికార ప్రతినిధి, మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. గురువారం ప్రస్తుత డిసిసి అధ్యక్షుడు, టి యు ఎఫ్ ఐ డి సి చైర్మన్ చల్లా నర్సింహ రెడ్డి కి ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, ఆమనగల్లు మాజీ జెడ్పిటిసి శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి పలువురు పార్టీ నేతలతో కలిసి హైదరాబాద్ లో దరఖాస్తును అందజేశారు. పాతికేళ్లుగా పార్టీకి అందిస్తున్న సేవలను గుర్తించి తనకు అవకాశం కల్పించాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ ,యువజన కాంగ్రెస్ , ఐఎన్టీయూసీలో గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు వివిధ పదవులు చేపట్టి పార్టీ బలోపేతానికి ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేశానని తెలిపారు. నాలుగు పర్యాయాలుగా కల్వకుర్తి నియోజకవర్గం లో ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల్లో అభ్యర్థుల విజయం కోసం పనిచేశానని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. పదవులు ఉన్నా లేకపోయినా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేశానని తెలిపారు. ఒకే జెండా కింద ,విద్యార్థి దశ నుంచి కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతూ విధేయుడుగా పని చేస్తున్న తనకు అవకాశం కల్పిస్తే పార్టీ ఆదేశాలకు అనుగుణంగా నడుచుకుంటానని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డిసిసి అధ్యక్ష నియామక అబ్జర్వర్ ను కలిసి దరఖాస్తులను అందజేస్తానని తెలిపారు.



## ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే డెలివరీ కావాలి

- వైద్య అధికారుల పని తీరు మెరుగు పడాలి
- జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ మహా;** ప్రభుత్వ ఆసుపత్రుల మీద ప్రజలకు ఎంతో నమ్మకం ఉంటుందని దాన్ని కాపాడుకునే విధంగా వైద్య అధికారులు సేవలందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. వైద్య సేవలకు సంబంధించిన వివిధ అంశాల మీద పీహెచ్ సి ల వారీగా జిల్లా వైద్య అధికారి, ఎన్సీహెచ్ సి ల మెడికల్ అధికారులు, సూపరిండెంట్ లతో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని దీన్ని దృష్టిలో పెట్టుకొని వైద్య సేవల విషయంలో మెడికల్ అధికారులు బాధ్యతయుతంగా పని చేయాలన్నారు. కార్పొరేట్ ఆసుపత్రి లకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రి లలో అత్యాధునిక వైద్య పరికరాలు, యంత్రాలు ఉన్నాయని అందుకు తగ్గట్టుగా డాక్టర్లు తమ విధులను నిర్వర్తించాలన్నారు. ప్రసవాలు కేవలం ప్రభుత్వ ఆసుపత్రి లోనే జరగాలని క్లస్టర్ లెవల్ సమీక్షా సమావేశాలు నిర్వహించి పురోగతి సాధించాలన్నారు.

**రైతులు సీసీఐ కె నేరుగా పత్తిని విక్రయించండి**

పత్తి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని.. మద్దతు ధర పొందాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు మీద అదనపు కలెక్టర్ బె న్షలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మార్కెటింగ్, వ్యవసాయ, ఫైర్, విద్యుత్, జీన్నింగ్ మిల్ యాజమాన్యం వారితో గురువారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హల్ లో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1,26,119.35 ఎకరాల్లో పత్తి సాగు అయ్యిందని 1,38,731.285 టన్నుల పత్తి ఉత్పత్తి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారన్నారు. మొత్తం జిల్లాలో 15 పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు అతి త్వరగా వీటిని ప్రారంభించేందుకు అధికారులు ప్లాన్ చేయాలని ఇందుకు సంబందించి సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. పత్తి కొనుగోలు కేంద్రాలను మనటరింగ్ చేసేందుకు ఏఎంసీ ల వారీగా లోకల్ కమిటీలను నియమించి..ఎప్పటికప్పుడు రైతులు మద్దతు ధర పొందెల కృషి చేయాలన్నారు లీగల్ మెట్రాలాజి అధికారులు తేమ కొలిచే యంత్రాలను పరిశీలించాలన్నారు. సీసీఐ అధికారుల పర్యవేక్షణ ఉండాలని, అగ్ని ప్రమాదాలు జరగకుండా జీన్నింగ్ మిల్లు యాజమాన్యం తగు జాగ్రత్త లు తీసుకోవాలన్నారు ఏ చిన్న ప్రమాదం జరగకుండా అగ్ని మాపాక శాఖ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు అనంతరం పత్తి మద్దతు ధర పోస్టర్లను ఆవిష్కరించారు.

# సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

**పనుల పురోగతిపై సమీక్షా సమావేశం.. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్, మహా:** వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. గురువారం వరంగల్ లో నిర్మాణంలో ఉన్న వరంగల్ సూపర్ స్పెషాలిటి హాస్పటల్ ను కలెక్టర్ సందర్శించి సంబంధిత అధికారులతో సమావేశమై పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా భవనంలోని సివిల్, ఎలక్ట్రికల్ పనుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకొన్నారు. ప్రతి అంతస్తు లోని నిర్మాణ స్తితి గతులను తెలుసుకొని, ఆ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే వైద్య పరికరముల అమరికను, మంచినీటి సౌకర్యాలు, రోడ్లు డ్రైనేజీల నిర్మాణం, తదితర అంశాల గురించి చర్చించారు. అంతేకాకుండా వివిద శాఖాధిపతులలో వారి శాఖలకు కేటాయించిన స్థలములో మార్పులు, ఇతర అవసరాల గురించి చర్చించడం తో పాటు ప్రతి దశలో పనుల పురోగతిని తనిఖీ చేస్తూ, అవసరమైన మౌలిక వసతులను సమకూర్చేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో యం జియం హాస్పటల్ సూపరింటెండెంట్ కిషోర్, కెఎంసి ప్రిన్సిపాల్ సంధ్యారాణి, ఆర్. ఎం. వోలు, వివిధ విభాగాల అధిపతులు, ఆర్.& బి డిపార్ట్మెంట్ ఇజనీర్లు, ఎల్ & టి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఓట్ల దొంగతనాన్ని ఆపండి

- రాహుల్ గాంధీ పోరాటానికి మద్దతుగా నిలుద్దాం - ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం
- టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్

**ఆమనగల్లు, మహా:** ఓట్ల చోరిపై రాహుల్ గాంధీ పోరాటానికి మద్దతుగా నిలిచి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందమని టిపిసిసి సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు.ఏఐసీసీ ఆదేశాల మేరకు బీజేపీ పార్టీ ఓట్ చోర్ అవినీతిని బహిర్గతం చేయడం కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా గురువారం కడ్తాల మండల పరిధిలోని మైసిగండి ఓట్ చోరీ పై సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఓటు చోరీకి వ్యతిరేకంగా ప్రతీ గ్రామంలో వంద మందితో సంతకాల సే కరణ చేపట్టాలని, దేశంలో ప్రతీ చోట బీజేపీ ఓటు చోరీకి పాల్పడిందన్నారు.ఎన్నికల వ్యవస్థ స్వయం పాలన, స్వీయ నిర్ణాయాధికారం కాపాడడానికి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టామన్నారు. దొంగ ఓట్లతో నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చారని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో జవహర్ లాల్ నాయక్,హిరాసింగ్, స్టాలిన్ కిషన్, తులసిరామ్, చిల్లి శంకర్, రాము,సుధీర్,గోపి,జగన్, రమేష్,నరేష్,చిన్న,అమర్ సింగ్,సాయి,మోత్య, రాజు, చాత్య, మల్లేష్, కంశ, శంకర్ చందర్, శీను, పాండు, చిన్న, బుజ్జి, కంలి, నీల, తదితరులు పాల్గొన్నారు.

## పోషక మాసాన్ని సద్వినియోగం చేసుకోవాలి : సెక్టార్ సూపర్వైజర్ రాధిక



**ఆమనగల్లు, మహా :** గర్భిణీలు, బాలింతలు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న పోషక మాసాన్ని సద్వినియోగం చేసుకోవాలని సెక్టార్ సూపర్వైజర్ రాధిక అన్నారు.ఆమనగల్లు మండల పరిధిలోని ఆకుతోటపల్లి గ్రామంలో పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు.ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పోషక మాసాన్ని నిర్వహించి గర్భిణీలు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించాలని కోరారు. పుట్టిన వెంటనే పిల్లలకు తల్లిపాలు పట్టించాలన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్స్ విజయలక్ష్మి , నాగ శిరోమణి, అలివేలు, సారమ్మ ,రాములమ్మ , ముత్యాలమ్మ, భారతమ్మ, సువర్ణ, లక్ష్మి, సాలి,పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన ఎంపీడీఓ



**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు మండలంలోని రాంనుంతల గ్రామంలోని పెద్దతండాలో ఇందిరమ్మ ఇండ్లను ఎంపీడీవో కుసుమ మాధురి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అనంతరం కమిటీ సభ్యులతో చర్చించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిందని, ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇండ్లను త్వరగ వచ్చిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాల మల్లేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# వరంగల్ ఆర్టీఏలో నకిలీ ఇన్సూరెన్స్ పత్రాల కలకలం

**పత్రాలు బహిర్గతం కాగానే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు**

**నకిలీ పత్రాల పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి**



**వరంగల్ మహా;** వరంగల్ ఆర్టీఏ కార్యాలయం అనగానే ఏజెంట్లదే పూర్తి హవా అనే ముద్ర పడింది. ఆన్లైన్ అన్న మాటే కానీ ఆ కార్యాలయానికి వెళ్తే ప్రతి దానికి ఒక రేటు ఫిక్స్ అయ్యి ఉంటుందనే ఆరోపణలు లేకపోలేదు. మీ సేవ ఆన్లైన్ సెంటర్లలో ఎవరైనా లర్నింగ్, డ్రైవింగ్ లైసెన్స్, రిన్యల్ వంటివి అప్లై చేసుకున్నప్పటికీ వాటిని అధికారులు పట్టించుకోరనే అపనిందలు అక్కడికి వెళ్లి తిరిగి తిరిగి వేసారిన సామాన్యులు చెబుతుంటారు. ఎందుకంటే ఎవరైనా ఆర్టీఏ కార్యాలయం చుట్టుపక్కల ఉన్నటువంటి ఏజెంట్ల ద్వారా రావాల్సిందేనని వారి ద్వారా అధికారులకు ముడుపులు ముట్టాల్సిందే అప్పుడే నేరుగా ఇంటికి ఒరిజినల్ కార్డు వస్తుంది. లేదంటే నో.. వారు పెట్టే కొర్రీలతో మతిపోతుందని బాధితులు ఆరోపిస్తున్నారు. గత రెండు రోజులుగా కార్యాలయంలో ఆర్టీఏ కు సంబంధించిన సర్వర్ సరిగ్గా పనిచేయకపోవడంతో గంటల కొద్దీ నిలబడలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనికి తోడు ఆర్టీఏ కార్యాలయంలో గురువారం నకిలీ ఇన్సూరెన్స్ పత్రాలు బహిర్గతం కావడం నగరంలో కలకలం రేపింది. అక్కడ ఉన్న ప్రజలు నకిలీ పత్రాల మాట విని కంగుతిన్నారు. ఆ నకిలీ ఇన్స్యూరెన్స్ పత్రాలతో ఏకంగా వ్యవసాయ ట్రాక్టర్ రిజిస్ట్రేషన్ కు ప్రయత్నం చెయ్యగా చివరకు ఆర్టీఏ అధికారులు అవి నకిలీ ఇన్సూరెన్స్ పత్రాలని గుర్తించి వ్యవసాయ ట్రాక్టర్ ను సీజ్ చేశారు. గతంలో కూడా ఇలాంటి సంఘటనలే జరిగాయని ఇప్పుడు మళ్ళీ నకిలీ ఇన్స్యూరెన్స్ బాగోతాలు మొదలైయ్యాయని కార్యాలయం వద్ద గుసగుస లాడుకుంటున్నారు. ఇవే కాకుండా సదరు అధికారులు గుర్తించనివి ఇంకెన్ని తప్పుడు రిజిస్ట్రేషన్లు జరిగాయో అంటూ ఆరోపణలు వస్తున్నాయి. ఈ అంశం పై అధికారులు సంబంధిత పోలీస్ స్టేషన్ లో పిర్యాదు కూడా చేశారు. ఇప్పటికైనా ఆర్టీఏ అధికారులు చొరవ తీసుకుని ఏజెంట్ల ద్వారా వచ్చిన పత్రాలను పునః పరిశీలించాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఇటువంటి నకిలీ పత్రాలను సృష్టించే వారిపై టాస్క్ఫోర్స్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వారి పై చర్యలు తీసుకోవాలంటూ ప్రజలు వేడుకోంటున్నారు.



## హసన్ పర్తి పోలీస్ ఠాణాను సందర్శించిన సీపీ

**బాధితులకు పారదర్శకంగా న్యాయం అందించాలి**

**హన్మకొండ మహా;** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ గురువారం హసన్ పర్తి పోలీస్ స్టేషన్ ను తొలి సారిగా సందర్శించారు. ఈ సందర్భంగా కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, హసన్ పర్తి ఇన్స్ స్పెక్టర్ చేరాలు పోలీస్ కమిషనర్ కు పుష్పాగుచ్చాలను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి స్టేషన్ పరిధిలో లోని గ్రామాలు, ఎలాంటి ఫిర్యాదులు అధికంగా నమోదవుతాయి, నేరాల నియంత్రణకై తీసుకుంటున్న చర్యలు, రౌడీ షీటర్లు, అనుమానిత వ్యక్తుల వివరాలతో పాటు స్టేషన్ అధికారులు, సిబ్బంది నిర్వహిస్తున్న విధుల పై సీపీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా హన్మకొండ కరీంనగర్ ప్రధాన రోడ్డు మార్గంలో రోడ్డు ప్రమాదాల నివారణ కై తీసుకుంటున్న చర్యల పై సీపీ ఆరా తీశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ బాధితులకు పారదర్శకంగా న్యాయం అందించాలని, నీతి, నిజాయితీగా విధులు నిర్వహిస్తూ ప్రజలు అభిమానాన్ని పొందాలని పోలీస్ కమిషనర్ సూచించారు.

## ప్రైవేట్ ఆసుపత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం

# నియమాలను పాటించాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**




**హన్మకొండ మహా;** జిల్లాలోని ప్రైవేట్ క్లినిక్ లు, ఆసుపత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం నియమాలను తప్పనిసరిగా పాటించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్, రిజిస్టరింగ్ అథారిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఐఎంఏ, తానా, గైనకాలజిస్ట్ అసోసియేషన్, డెంటల్, ఆయుర్వేదిక్, హోమియో, యునాని, ఫిజియోథెరపి అసోసియేషన్ల ప్రతినిధులతో ప్రభుత్వ నియమ నిబంధనలు మేరకు క్లినిక్ లు, ఆసుపత్రుల ఏర్పాటు, నిర్వహణ, అనుమతులు, ఫీజుల పట్టిక, ఫైర్ సేఫ్టీ, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్, తదితర అంశాలపై సమావేశం లో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా ఆసుపత్రులు, క్లినిక్ లు నిర్వహించవద్దని, చట్టం నియమాలకు అనుగుణంగా నిర్వహించడం లో అసోసియేషన్లు సహకరించాలని సూచించారు. ప్రైవేట్ ఆసుపత్రుల వద్ద పార్కింగ్ సమస్యలు తలెత్తుతున్నాయని, వీటిపై తరచుగా ఫిర్యాదులు అందుతున్నాయని అన్నారు. ఆసుపత్రిల వద్ద సరైన పార్కింగ్ స్థలం ఉండే విధంగా ఆసుపత్రుల యాజమాన్యాలు చూసుకోవాలన్నారు. కొత్తగా ఏర్పాటు చేసే ఆస్పత్రులకు ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మించాలని, ఆక్యుపెన్సి సర్టిఫికెట్ ను తప్పనిసరిగా తీసుకోవాలని, ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తేనే ఆసుపత్రులకు అనుమతులు ఇవ్వబడతాయన్నారు. అదేవిధంగా కాలుష్య నియంత్రణ మండలి ( పి సి బి ) మార్గదర్శకాల ప్రకారం బయో మెడికల్ వేస్ట్ చార్జీలను ఆసుపత్రుల వద్ద తీసుకోవాలని సంబంధిత ఏజెన్సీని ఆదేశించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వైద్య సేవల నిమిత్తం ఆస్పత్రులు, క్లినిక్ లకు వచ్చే రోగులకు రాసే చీటీ లో కాంపోజిషన్ తో పాటు మందుల వివరాలు అర్థమయ్యే విధంగా పెద్ద అక్షరాల ( క్యాపిటల్ లెటర్స్)తో చీటీలో వైద్యులు తప్పనిసరిగా రాయలన్నారు. ప్రతి ఆసుపత్రిలో వైద్య సేవల రుసుమును తెలియజేసే విధంగా ఛార్జీల పట్టిక ప్రదర్శించాలన్నారు. సమావేశంలో చర్చించిన విధంగా ఛార్జీ ల పట్టిక ప్రదర్శనతో పాటు, క్యాపిటల్ లెటర్స్ తో ప్రిస్క్రిప్షన్ రాసే విధంగా ఐఎంఏ, తానా అసోసియేషన్ల సభ్యులకు తెలియజేస్తామని ఆ అసోసియేషన్ల ప్రతినిధులు కలెక్టర్ కు సమాధానమి చ్చారు. ప్రతి ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, జిమ్ సెంటర్లు, అవసరమైన ఇతర చోట్ల సిపిఆర్ ప్రాముఖ్యతను గురించి తెలియజేస్తూ శిక్షణ ఇవ్వడానికి అసోసియేషన్లు సహకరించాలని సూచించారు. అదేవిధంగా ఆరోగ్యాంశాలకు సంబంధించి ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పించడానికి భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ విషయమై అసోసియేషన్ లప్రతినిధులు స్పందిస్తూ ఆరోగ్య అంశాలకు సంబంధించి అవగాహన కార్యక్రమాలలో పాల్గొంటామని తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగార్జున రెడ్డి, రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ విజయ్ చందర్ రెడ్డి, గైనకాలజిస్ట్ ల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ రాధిక, ఐడిఏ అధ్యక్షుడు డాక్టర్ ప్రీతం రెడ్డి, ఆయుర్వేదిక్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ రవీందర్, హోమియో అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ సుధాకర్ రావు, ఫిజియోథెరపీ అసోసియేషన్ ప్రతినిధి సురేష్ కుమార్, స్టాటిస్టికల్ అధికారి ప్రసన్న కుమార్, డెమో అశోక్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.




## ధాన్యం, పత్తి, మక్క, కొనుగోలు పై సమగ్ర కార్యాచరణ

- ప్రభుత్వ మద్దతు ధరలకే ధాన్యం కొనుగోలు చేయాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా వ్యవసాయ పరిధిలో వచ్చే ధాన్యం, పత్తి, మక్క (మైజ్) పంటల కొనుగోలు ప్రక్రియపై కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలసి సమీక్షా సమావేశాన్ని సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, పంటల కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ధాన్యం, పత్తి, మక్క తదితర పంటలను ప్రభుత్వ మద్దతు ధరలపై కొనుగోలు చేయడంలో ఏ విధమైన ఆలస్యం చోటు చేసుకోకూడదని, ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు రైతు పంట నమోదు, కొనుగోలు కేంద్రాల లభ్యత, మద్దతు ధరలు, తూకపు యంత్రాల సక్రమ వినియోగం, శుద్ధి, టార్పాలిన్స్, గోదాములు వంటి అంశాలపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ప్రజా ప్రతినిధులు, రైతు సమాఖ్యల సహకారంతో సమాచారాన్ని గ్రామ స్థాయిలో చేరాలని సూచించారు. కేంద్రాల వద్ద రైతులు ఇబ్బందులు పడకుండా నీటి, విశ్రాంతి, మౌలిక వసతులు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ప్రతి మండల వ్యవసాయ అధికారి తాము పర్యవేక్షించే ప్రాంతంలోని కొనుగోలు కేంద్రాల పని తీరును నిత్యం పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జెడ్పి సీఈఓ, ఇంచార్జి డిఆర్డీఓ రామిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ , జిల్లా సహకార అధికారి నీరజ, జిల్లా ఉద్యానవన అధికారి శ్రీనివాసరావు, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ,మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ రంజిత్ రెడ్డి, వ్యవసాయ సహాయ సంచాలకులు దామోదర్ రెడ్డి,, మండల వ్యవసాయ శాఖాధికారులు, ఎంఈఓ లు, హెచ్ఓ లు తదితరులు పాల్గొన్నారు.


## నూతన ఓటర్లకు గుర్తింపు కార్డులను అందించాలి

**రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి**




**వరంగల్ మహా;** నూతన ఓటర్లకు గుర్తింపు కార్డులను తపాలా శాఖ ద్వారా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్ లోని రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి కార్యాలయం నుండి ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రం లోని అన్ని జిల్లాల జిల్లా ఎన్నికల అధికారులుకలెక్టర్లు, సహాయ ఎన్నికల అధికారులు, తహసిల్దార్ల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి మాట్లాడుతూ నూతనంగా ఓటర్లుగా నమోదైన ప్రతి ఒక్కరికి తపాలా శాఖ ద్వారా ఓటర్ గుర్తింపు కార్డులను పంపిణీ చేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలని, ఫారం 6, 7, 8 దరఖాస్తులను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ విసిలో డిఆర్ఓ మరియు ఆర్డీవో వరంగల్ ఇన్చార్జ్ విజయలక్ష్మి, నర్సంపేట ఆర్డిఓ ఉమారాణి సంబంధిత తహసీల్దార్లు పాల్గొన్నారు.

## కార్యకర్తల అభిప్రాయాల మేరకే అధ్యక్షుడి ఎంపిక





**ఏఐసీసీ పరిశీలకుడు నవజోత్ పట్నాయక్**

**వరంగల్ మహా ;** వరంగల్ జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాల మేరకే ప్రజల మధ్యన ఉండే నాయకుడే వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకోవడం జరుగుతుందని ఏఐసీసీ పరిశీలకుడు నవ జ్యోతి పట్నాయక్ అన్నారు. గురువారం వరంగల్ బస్టాండ్ దగ్గరలో ఎంకె నాయుడు ఫంక్షన్ హాల్ లో వరంగల్ తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ (ఏఐసీసీ) పరిశీలకులుగా విచ్చేసిన నవజ్యోతి పట్నాయక్, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు పాల్గొన్నారు. వరంగల్ డీసీసీ అధ్యక్ష పదవి ఎన్నికకు సంబంధించిన సమావేశంలో డీసీసీ అధ్యక్ష పదవి కోసం వరంగల్ తూర్పులోని డివిజన్ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, మహిళలు, కార్యకర్తల నుంచి డివిజన్ల వారీగా ముగ్గురి నాయకుల పేర్లను సెలక్షన్ కోసం తీసుకున్నారు. ఈ సమావేశం లో కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయులు, ముఖ్య నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను భవిష్యత్తులో దేవాలయాలుగా తీర్చిదిద్దాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్ మహా;** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ, విద్యార్థులకు అందించాల్సిన కనీస సదుపాయాల పై వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం కలెక్టరేట్ లో మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాలల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే దేవాలయాలుగా మార్చాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా పాఠశాలల నిర్వహణ, శుభ్రత, మౌలిక వసతుల కల్పన, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, ఫర్నిచర్, డిజిటల్ తరగతుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. విద్యార్థులకు మంచి పరిసరాలు కల్పిస్తేనే వారు విద్యలో పురోగతి సాధించగలరని అన్నారు. పాఠశాలల్లో వసతుల కల్పన, ఎఫ్ ఆర్ సి ద్వారా విద్యార్థుల హాజరు,విద్యార్థుల యుడైస్, అపార్ లో నమోదు, మధ్యాహ్న భోజన పథకం, యూనిఫామ్ లు, పాఠ్యాచరణ అమలు తదితర అంశాలపై కలెక్టర్ విశ్లేషణాత్మకంగా చర్చించారు. ప్రతి ప్రధానోపాధ్యాయుడు తమ పాఠశాల అభివృద్ధిపై వ్యక్తిగత బాధ్యతతో ముందుకు సాగాలని సూచించారు. మండల విద్యా అధికారులు నిరంతరంగా పర్యవేక్షణ చేయాలని, ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే జిల్లా స్థాయికి నివేదించాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో ఫిర్యాదుల పెట్టే విధిగా ఏర్పాటు చేసి ఏమైనా సమస్యలుంటే కంప్లైంట్ బాక్స్ లో వేసేలా విద్యార్థులను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, ఏ ఎస్ ఓ వేణుగోపాల్ మండల విద్యా శాఖ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# అమీర్ చంద్ ఐపీవోకు రెడీ




## సెబీ నుంచి గ్రీన్‌సిగ్నల్

**న్యూఢిల్లీ:** బాస్మతి బియ్యం ఎగుమతి సంస్థ అమీర్ చంద్ జగదీష్ కుమార్(ఎక్స్‌పోర్ట్స్) లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఇందుకు తాజాగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇష్యూ ద్వారా హర్యానా కంపెనీ రూ. 550 కోట్లు సమీకరించే ప్రణాళికల్లో ఉంది. ఇందుకు కొత్తగా ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. ఈ ఏడాది జూన్‌లో సెబీకి దరఖాస్తు చేసిన కంపెనీ తాజాగా అనుమతి పొందింది. ఐపీవో నిధులను వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. ఏరోప్లేన్ బ్రాండు కంపెనీ ప్రధానంగా బాస్మతి బియ్యం ప్రాసెసింగ్‌తో పాటు ఎగుమతులు చేపడుతోంది. దేశీయంగా లిస్టెడ్ కంపెనీలు కేఆర్‌బీఎల్, ఎల్‌టీ ఫుడ్స్‌సహా సర్వేశ్వర్ ఫుడ్స్ తదితరాలతో పోటీ పడుతోంది. 2024 డిసెంబర్‌తో ముగిసిన 9 నెలల కాలంలో రూ. 1,421 కోట్ల ఆదాయం, రూ. 49 కోట్ల నికర లాభం ఆర్జించింది.


# రూ.3,900 కోట్లు సమీకరించిన జెప్టో

## రూ.61,600 కోట్లకు కంపెనీ విలువ.. త్వరలో 40 శాతానికి దేశీ ఇన్వెస్టర్ల వాటా

**న్యూఢిల్లీ:** క్విక్‌కామర్స్ సంస్థ జెప్టో తాజాగా 450 మిలియన్ డాలర్ల (రూ.3,900 కోట్లు1. సుమారు) నిధులను సమీకరించింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ 7 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఏడాది క్రితం 350 మిలియన్ డాలర్ల నిధుల సమీకరణ నాటికి కంపెనీ మార్కెట్ విలువ 5 బిలియన్ డాలర్లుగా ఉండడం గమనార్హం. అక్కడి నుంచి చూస్తే 40 శాతం పెరిగినట్టు తెలుస్తోంది. తాజా నిధుల సమీకరణంలో అధిక భాగం కొత్త ఈక్విటీ షేర్ల జారీ రూపంలోనే ఉంది. అలాగే తొలినాళ్లలో పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్లలో కొందరు స్వల్ప వాటాలను విక్రయించారు. ఈ విడతలో కాల్‌పర్స్ నుంచి ఎక్కువగా పెట్టుబడులు వచ్చాయి. ప్రస్తుతం కంపెనీ ఖాతాల్లో 900 మిలియన్ డాలర్ల మేర నికర నగదు నిల్వలు ఉన్నాయని, భవిష్యత్తు అవసరాలకు పూర్తిగా సరిపోతాయని కంపెనీ సీఈవో, సహ వ్యవస్థాపకుడు ఆదిత్ పలీచా తెలిపారు. త్వరలో పబ్లిక్ ఇష్యూ చేపట్టాలనుకుంటున్న జెప్టోలో ప్రస్తుతం దేశీ ఇన్వెస్టర్ల వాటా 12 శాతంగా ఉండగా, కొన్ని వారాల్లోనే ఇది 40 శాతానికి చేరుకుంటుందని చెప్పారు. క్విక్‌కామర్స్ విభాగంలో బ్లింకిట్, ఇన్‌స్టామార్ట్‌లకు గట్టిపోటీనిస్తున్న జెప్టో పట్ల ప్రైవేటు ఇన్వెస్టర్లలో బలమైన విశ్వాసం కనిపిస్తోంది. రోజువారీ 17 లక్షల ఆర్డర్లను స్వీకరిస్తున్నట్టు.. మెజారిటీ డార్క్‌స్టోర్లు లాభాల్లోకి వస్తున్నట్టు పలీచా తెలిపారు. గతేడాది నిధుల సమీకరణ నాటితో పోల్చితే ఈ విడత మెజారిటీ స్టోర్లు లాభాల్లోకి వచ్చినట్టు చెప్పారు.

### విస్తరణపై వ్యయం

తాజాగా సమకూరిన పెట్టుబడులతో బ్యాలన్స్ షీట్‌ను మెరుగ్గా నిర్వహించగలమని, మోస్తరు విస్తరణకు వ్యయం చేయొచ్చని పలీచా చెప్పారు. ఒకవైపు కార్యకలాపాలను విస్తరిస్తూనే, లాభాల్లోకి రావడంపై దృష్టి సారించినట్టు పేర్కొన్నారు.




# వాహన టోకు విక్రయాలు పెరిగాయ్

## కలిసిసొచ్చిన జీఎస్‌టీ సంస్కరణలు.. పండగ సీజన్ కొనుగోళ్ల దన్ను.. సియామ్ గణాంకాల వెల్లడి

**న్యూఢిల్లీ:** జీఎస్‌టీ సంస్కరణ, పండుగ సీజన్ కలిసిరావడంతో తయారీదార్ల నుంచి డీలర్లకు ప్యాసింజర్ వాహనాలు, ద్వి చక్రవాహనాల సరఫరా గణనీయంగా పెరిగాయి. పెరిగిన టోకు విక్రయాలతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరాన్ని సానుకూలంగా ముగించవచ్చనే ఆశాభావంతో వాహన పరిశ్రమ ఉన్నట్లు సియామ్ పేర్కొంది. 'కొత్త జీఎస్‌టీ ధరలు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి వచ్చినప్పటికీ.., కేవలం తొమ్మిది రోజుల్లోనే ప్యాసింజర్ వాహనాలు, టూ వీలర్స్, త్రీ వీలర్స్ విభాగాలు గతంలో ఎన్నడూ లేనంతగా సెపెటెంబర్‌లో అత్యధిక అమ్మకాలు నమోదు చేశాయి. ప్రభుత్వం జీఎస్‌టీ 2.0 అమల్లోకి తీసుకురావడమనేది ఒక చారిత్రాత్మక నిర్ణయం. ఇది ఆటో పరిశ్రమలో కాకుండా, మొత్తం ఆర్థికవ్యవస్థలో చైతన్యం తీసుకొస్తుంది'' అని సియామ్ అధ్యక్షుడు శైలేష్ చంద్ర తెలిపారు.

- కంపెనీలు సెప్టెంబర్‌లో డీలర్లకు 3,72,458 ప్యాసింజర్ వాహనాలను పంపిణీ చేశాయి. గతేడాది ఇదే నెలలో పంపిణీ 3,56,752 యూనిట్లతో పోలిస్తే ఇవి 4% అధికం.
- ద్విచక్రవాహన విక్రయాలు 7% వృద్ధి చెంది 21,60,889 యూనిట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే నెలలో 20,25,993 టూ వీలర్స్ అమ్ముడయ్యాయి.
- త్రీ చక్రవాహన టోకు అమ్మకాలు 79,683 నుంచి 84,077 యూనిట్లకు పెరిగాయి.

**త్రైమాసిక ప్రాతిపదికన....**

వార్షిక ప్రాతిపదికన క్యూ2లో 10.39 లక్షల పీవీ అమ్మకాలు అమ్ముడయ్యాయి. టూ వీలర్స్ విక్రయాలు 7% వృద్ధి చెంది 55.62 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయి. త్రి చక్రవాహన విక్రయాలు 10% వృద్ధి చెంది 2,29,239 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. ఇదే సెప్టెంబర్ త్రైమాసికంలో 2.4 లక్షల వాణిజ్య వాహన విక్రయాలు జరిగాయి.



# సెబీకి డ్యూరోఫ్లెక్స్ ప్రాస్పెక్టస్




**న్యూఢిల్లీ:** మ్యాట్రెస్‌ల తయారీ సంస్థ డ్యూరోఫ్లెక్స్ తమ పబ్లిక్ ఇష్యూకి సంబంధించిన ముసాయిదా పత్రాలను (డీఆర్‌హెచ్‌పీ) మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించింది. దీని ప్రకారం రూ. 183.6 కోట్ల విలువ చేసే షేర్లను తాజాగా జారీ చేయనుండగా, 2.25 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్) కింద ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్లు విక్రయించనున్నారు. తాజా షేర్ల జారీ ద్వారా సమీకరించిన నిధులను కొత్తగా 120 స్టోర్స్ (కంపెనీ ఓన్డ్, కంపెనీ ఆపరేటెడ్ - కోకో) ప్రారంభించేందుకు, ప్రస్తుత స్టోర్స్.. తయారీ ప్లాంటు లీజులు-అద్దెలు చెల్లించేందుకు, మార్కెటింగ్ వ్యయాలు, ఇతరత్రా కార్పొరేట్ అవసరాలకు కంపెనీ వినియోగించుకోనుంది. 1963లో ప్రారంభమైన డ్యూరోఫ్లెక్స్, మార్కెట్ వాటాపరంగా దేశీయంగా టాప్ 3 మ్యాట్రెస్‌ల తయారీ సంస్థల్లో ఒకటిగా ఉంది. డ్యూరోఫ్లెక్స్, స్లీపీహెడ్ బ్రాండ్స్ పేరిట మ్యాట్రెస్‌లు, సోఫాలు, ఇతరత్రా ఫర్నిచర్లు మొదలైనవి విక్రయిస్తోంది. 2025 జూన్ 30 నాటికి దేశవ్యాప్తంగా 73 కోకో స్టోర్స్, 5,500 పైగా జనరల్ ట్రేడ్ స్టోర్స్ ఉన్నాయి. 2023 ఆర్థిక సంవత్సరంలో రూ. 1,057 కోట్లుగా ఉన్న ఆదాయం 2025 ఆర్థిక సంవత్సరంలో రూ. 1,134 కోట్లకు చేరింది.




# లొంగిపోయేందుకు వస్తున్న.. 140 మంది మావోయిస్టులు

**బీజాపూర్:** మావోయిస్టుల లొంగుబాటు పరంపర కొనసాగుతోంది. ఆ పార్టీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ అభయ్ మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట బుధవారం లొంగిపోగా... అదే బాటలో మరో అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న కూడా ఇవాళ లొంగిపోయారు. ఈ క్రమంలో ఛత్తీస్‌గఢ్‌లో కీలక నేతలు రూపేష్, రనిత సహా 140 మంది మావోయిస్టులు లొంగిపోయేందుకు సిద్ధమయ్యారు. రేపు (శుక్రవారం, అక్టోబర్ 17న జగదల్‌పూర్‌లో ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయ్, హోం మంత్రి విజయ్ శర్మ ఎదుట లొంగిపోనున్నారు. కేంద్ర కమిటీ సభ్యుడు రూపేష్, మాడ్ డివిజన్ కార్యదర్శి రనిత, ఇద్దరు DKSZC సభ్యులు, 15 మంది DVC సభ్యులు సహా మొత్తం 140 మంది మావోయిస్టులు లొంగిపోవడానికి భైరామ్‌గఢ్ వైపు వెళుతున్నారు. వారు ఇంద్రావతి నది అవతలి వైపుకు చేరుకుంటారు. నక్సలైట్లందరూ లొంగిపోవడానికి 70కి పైగా ఆయుధాలను తీసుకువస్తున్నట్లు సమాచారం. భైరామ్‌గఢ్ నుండి ఇంద్రావతి నదిపై ఉన్న ఉస్పారి ఘాట్ వరకు భద్రతా దళాలు గట్టి భద్రతను మోహరించాయి. దంతేవాడ, బీజాపూర్ సరిహద్దుల్లోని అడవుల నుంచి మావోయిస్టులు ఈ నదిని దాటి జగదల్‌పూర్‌కు చేరుకుంటున్నారు. ఉస్పారి ఘాట్ మార్గంలో బయటి వ్యక్తులెవరినీ ప్రయాణించడానికి అనుమతించడం లేదు. రూపేష్.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీనియర్ మావోయిస్టు నేత. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (DKZC) లోని మాడ్ డివిజన్‌లో లాజిస్టిక్స్, కమ్యూనికేషన్, శిక్షణ బాధ్యతలు నిర్వహించారు. కేంద్ర కమిటీ మరియు స్థానిక జోనల్ నిర్మాణం మధ్య సంబంధాల వారధిగా పనిచేశారు. రనిత.. DKZC మాడ్ డివిజన్ ఇన్‌చార్జ్‌గా పనిచేసిన సీనియర్ మహిళా కమాండర్. బస్తర్ జిల్లాల్లో విస్తృతంగా కార్యకలాపాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వరుస ఆపరేషన్‌లతో మావోయిస్టులకు దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. లొంగుపోక తప్పడం లేదు.



కేంద్రంతో చర్చలు జరపాలని పదే పదే యత్నించినా అది విఫలం కావడంతో ఇక లొంగుబాటు ఒక్కటే సరైన మార్గమని ఎంచుకున్న వందల సంఖ్యలో మావోయిస్టులు.. జన జీవన స్రవంతిలోకి వచ్చేస్తున్నారు. గత రెండు రోజులుగా అగ్రనేతలతో సహా 283 మంది మావోయిస్టులు తాము చేతపట్టిన తుపాకులను, నమ్ముకున్న అడవుల్ని వదిలి సాధారణ జీవితం గడపడానికి సిద్ధమవుతున్నారు.

# చైనాను అడ్డుకోవడానికి భారత్ మద్దతు కావాలి: స్కాట్ బెసెంట్



**వాషింగ్టన్:** అమెరికా, చైనా మధ్య టారిఫ్‌ల కారణంగా ట్రేడ్ వార్ కొనసాగుతోంది. అరుదైన ఖనిజాలపై చైనా ఆధిపత్యం విషయంలో అమెరికా ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో చైనాకు వ్యతిరేకంగా భారత్ మద్దతు ఇవ్వాలని ఆశిస్తున్నట్లు అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ (Scott Bessent) కీలక వ్యాఖ్యలు చేశారు. ఇదే సమయంలో చైనాను టార్గెట్ చేసి.. ప్రపంచ పంపిణీ వ్యవస్థలపై చైనా గురిపెట్టిందని ఆరోపణలు గుప్పించారు. అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ తాజాగా ఫాక్స్ న్యూస్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ..'అమెరికా ప్రపంచ శాంతి, ఆర్థిక స్థిరత్వం కోసం కృషి చేస్తోంది. ఇదే సమయంలో చైనా ప్రపంచంలో వార్ ఎకానమీకి ఫైనాన్స్ చేస్తోందని ఆరోపించారు. అరుదైన ఖనిజాల ఉత్పత్తి, సరఫరాపై చైనా పెంచుకుంటున్న ఆధిపత్యాన్ని అడ్డుకోవడంలో భారత్, యూరోపియన్ దేశాలు అమెరికాతో కలిసి నడవాలని పిలుపునిచ్చారు. అయితే, ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఆధునిక సాంకేతిక పరికరాలు, ఎలక్ట్రిక్ వాహనాలు, రక్షణ సామగ్రి తయారీలో ఈ ఖనిజాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. చైనా ఈ వనరులలో దాదాపు 70% సరఫరాను నియంత్రిస్తుండటంతో, అమెరికా దీనిని వ్యూహాత్మక ముప్పుగా చూస్తోంది. ఇక, అక్టోబర్ 9 నుంచి అరుదైన ఖనిజాల ఎగుమతులకు అనుమతులు తప్పనిసరి చేస్తూ చైనా నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అయితే.. ఆయన మాటల్లో స్పష్టంగా చైనాపై వ్యతిరేక ధోరణి కనిపించింది. అమెరికా, చైనా మధ్య వాణిజ్య వివాదాలు, సాంకేతిక పరమైన పోటీ, దక్షిణ చైనా సముద్రం వివాదం వంటి అంశాలు ఇప్పటికే ఉద్రిక్తతలను పెంచాయి. ఇప్పుడు అరుదైన ఖనిజాల విషయం కూడా ఆ వివాదానికి కేంద్ర బిందువుగా మారాయి. అమెరికా ఈ వనరుల సరఫరాను చైనా నుండి స్వతంత్రంగా మార్చుకునే ప్రయత్నంలో ఉంది. భారత్ ఈ రంగంలో విస్తారమైన వనరులు కలిగి ఉండటంతో, అమెరికా వ్యూహాత్మకంగా భారత్ వైపు మొగ్గు చూపుతోంది. మరోవైపు, అమెరికా ఇటీవల భారత్‌పై కొన్ని ఉత్పత్తులపై టారిఫ్‌లు విధించడం, వాణిజ్య పరమైన అడ్డంకులు సృష్టించడం విమర్శలకు దారితీసింది. టారిఫ్‌లతో భారత్ ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీస్తూనే, చైనాపై పోరులో మద్దతు కోరడం విరుద్ధ ధోరణిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. అయినప్పటికీ, ఖనిజాల రంగంలో భారత్ భాగస్వామ్యం అమెరికాకు వ్యూహాత్మకంగా అవసరమని విశ్లేషకులు భావిస్తున్నారు.

# రైలు వెనుక 'X' గుర్తు కనిపించకపోతే డేంజరే..!

దేశంలో అత్యంత విస్తృతంగా ఉపయోగించే రవాణా సాధనాలు రైళ్లు. సరళమైనవి, సౌకర్యవంతమైనవి, దేశవ్యాప్తంగా అద్భుతమైన కనెక్టివిటీని కలిగి ఉండటంతో నిత్యం కోట్లాది మంది రైళ్లలో ప్రయాణిస్తున్నారు. వేల సంఖ్యలో రైళ్లు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నాయి. వీటిని భారతీయ రైల్వే నిర్వహిస్తోంది. ఇండియన్ రైల్వే విస్తృత నెట్వర్క్, క్లిష్ట కార్యకలాపాలతోపాటు అనేక విశిష్ట చిహ్నాలు, గుర్తులతో ప్రయాణికులకు ఆసక్తిని రేకెత్తిస్తాయి. అలాంటి ప్రముఖ గుర్తుల్లో ఒకటి, ప్రతి రైలు చివరి కోచ్‌పై ఉండే బోల్డ్ 'ఎక్స్' (X) గుర్తు. మొదటిసారి చూసినప్పుడు ఇది కేవలం డిజైన్ లేదా సాధారణ గుర్తుగా అనిపించవచ్చు. అయితే, ఈ గుర్తు రైలు భద్రత, కార్యకలాపాల సమర్థతలో కీలక పాత్ర పోషిస్తుంది. దీని వాస్తవ అర్థం, ఉపయోగాన్ని తెలుసుకోవడం ట్రాక్ నిర్వహణ, రైలు ఆపరేషన్లకు ఎంతో అవసరం.

**రైలు పూర్తిగా దాటిందని నిర్ధారణ**

చివరి కోచ్‌పై ఉన్న "X" గుర్తు ప్రధానంగా రైలు పూర్తిగా స్టేషన్ గుండా దాటిందని రైల్వే సిబ్బందికి తెలియజేస్తుంది. ఇది ఒక దృశ్య సూచనగా పని చేస్తూ, అన్ని కోచ్‌లు పూర్తిగా వెళ్లిపోయాయని నిర్ధారించడంలో సహాయపడుతుంది. రాత్రి సమయంలో లేదా దృష్టి మందగించే వాతావరణంలో ఇది మరింత కీలకంగా మారుతుంది. కేవలం సిగ్నళ్లపై ఆధారపడటం చాలని పించినా ఈ "X" మార్కింగ్ అదనపు భద్రతా పొరగా నిలుస్తుంది.





**అత్యవసర పరిస్థితుల్లో గుర్తింపు**

కొన్నిసార్లు అరుదైన సంఘటనల్లో, ఒక కోచ్ రైలు నుండి వేరు కావచ్చు. అలాంటి సందర్భంలో, రైలు చివరి కోచ్‌పై "X" గుర్తు కనపడకపోతే, అది తక్షణమే ఒక హెచ్చరికగా మారుతుంది. దీనివల్ల రైల్వే అధికారులు సమస్యను వెంటనే గుర్తించి, తగిన చర్యలు తీసుకోవడానికి వీలవుతుంది. ఇది ప్రమాదాలను నివారించడంలో, ప్రయాణికులు, సిబ్బంది భద్రతను పరిరక్షించడంలో కీలకంగా ఉంటుంది.

# కెన్యా రాజకీయ దిగ్గజం ఒడిన్గా అస్తమయం

**నైరోబీ:** కెన్యా రాజకీయాలపై తనదైన చెరగని ముద్ర వేసిన దిగ్గజ విపక్ష నేత, మాజీ ప్రధానమంత్రి రైలా ఒడిన్గా తుదిశ్వాస విడిచారు. 80 ఏళ్ల వయసులో ఆయుర్వేద చికిత్స కోసం ఇటీవల ఆయన భారత్‌కు విచ్చేశారు. కేరళలోని కొత్తట్టుకులంలోని దేవమాత ఆస్పత్రిలో చేరారు. బుధవారం ఆస్పత్రి ప్రాంగణంలో ఉదయపు నడకకు ఒడిన్గా బయల్దేరగా గుండెపోటుతో కుప్పకూలారు. అక్కడే ఉన్న ఆయన కుమార్తె, సోదరి, వ్యక్తిగత వైద్యుడు, భారత, కెన్యా భద్రతాధికారులు హుటాహుటిన ఆయనను ఆస్పత్రిలోకి తీసుకెళ్లగా అప్పటికే ఆయన కన్నుమూశారని వైద్యులు ధ్రువీకరించారు. గత 12 సంవత్సరాలుగా కెన్యా పార్లమెంట్‌లో విపక్షనేతగా కొనసాగుతున్న ఒడిన్గా దేశ రాజకీయాల్లో కీలక భూమిక పోషించారు. అజీమియో లా ఉమోజా (వన్ కెన్యా) కూటమి పార్టీకి సారథ్యంవహిస్తున్నారు. ఒడిన్గా మరణ వార్త తెల్సి కెన్యా ప్రజలు శోకసంద్రంలో మునిగిపోయారు. దేశ ప్రజాస్వామ్యాన్ని పటిష్టంచేసేందుకు అవిశ్రాంతంగా పోరాడిన తమ నేత లేడన్న వార్త తెలిసి నైరోబీలోని ఆయన సొంతింటికి జనం పోటెత్తారు. కెన్యా అధ్యక్షుడు విలియం రూటో సైతం ఒడిన్గా నివాసానికి వెళ్లి ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. మరణం పట్ల భారత ప్రధాని మోదీ తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు. ''నిలువెత్తు దార్శనికుడు నేలకొరిగారు''అని 'ఎక్స్'లో ఒక పోస్ట్‌పెట్టారు. కెన్యా ప్రజాస్వామ్యం కోసం పాటుపడిన గొప్పనేత ఒడిన్గా అంటూ దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా, టాంజానియా అధ్యక్షుడు సమియా సులుహూ సహా పలువురు ప్రపంచనేతలు తమ సంతాప సందేశాల్లో పేర్కొన్నారు. కెన్నెత్ మతిబా తర్వాత బహుళ రాజకీయ పార్టీల కెన్యా ప్రజాస్వామ్యంలో ఒడిన్గాను మరో జాతిపితగా పలువురు కొనియాడతారు. ఇటీవలి దశాబ్దాల్లో ఒడిన్గా కెన్యా రాజకీయాల్లో ముఖ్యనేతగా ఎదిగారు. కెన్యా స్వాతంత్ర్యం సాధించాక తొలి ఉపాధ్యక్షుడిగా సేవలందించిన జరమోగు అజుమా ఒడిన్గా కుమారుడే ఈ ఒడిన్గా. కెన్యాలోని కిసుము నగరంలో 1945 జనవరి 7న జన్మించారు. రాజకీయ కుటుంబంలో జన్మించిన ఈయన చిన్నతనం నుంచే రాజకీయాలపై ఆకర్షితులయ్యారు. జర్మనీలో ఇంజనీరింగ్ చదివారు. రాజకీయాల్లోకి రాకముందు కెన్యా నాణ్యతా ప్రమాణాల సంస్థకు మేనేజర్‌గా పనిచేశారు. తర్వాత డిప్యూటీ డైరెక్టర్ స్థాయికి ఎదిగారు. అయితే కేంద్రప్రభుత్వాన్ని కూలదోయడానికి ప్రయత్నించాడన్న ఆరోపణలపై అరెస్టయి జైలు జీవితం గడిపారు. 1997లో తొలిసారిగా దేశాధ్యక్ష ఎన్నికల్లో పోటీచేసి ఓటమిపాలయ్యారు. తర్వాత దేశబహిష్కరణకు గురై యూరప్‌లో గడిపారు. 1992లో స్వదేశానికి తిరిగొచ్చారు.




మహా పత్రిక

WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | శుక్రవారం, హైదరాబాద్ | 17-10-2025

ANN తెలుగు

# కాంతార చాప్టర్-1 తగ్గేదేలే.. పుష్ప, సలార్ రికార్డ్స్ బ్రేక్!








కన్నడ హీరో రిషబ్ శెట్టి తెరకెక్కించిన కాంతార: చాప్టర్ 1 రెండు వారాలు దాటినా ఏ మాత్రం కలెక్షన్ల జోరు తగ్గడం లేదు. ఇప్పటికే రూ.650 కోట్లకు పైగా వసూళ్లతో దూసుకెళ్తోన్న ఈ సినిమా తాజాగా మరో రికార్డ్‌ను తన ఖాతాలో వేసుకుంది. హిందీలో అత్యధిక వసూళ్లు సాధించిన జాబితాలో టాప్10లో నిలిచింది. ఈ క్రమంలోనే టాలీవుడ్ స్టార్ చిత్రాలను అధిగమించింది. కేవలం హిందీలోనే రూ.155.5 కోట్ల కలెక్షన్స్ రాబట్టింది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా కళ్లు చెదిరే కలెక్షన్స్‌తో ప్రభంజనం సృష్టించిన కాంతార మరో రికార్డ్ క్రియేట్ చేసింది. ఈ క్రమంలోనే ప్రభాస్ సలార్(రూ. 152.65 కోట్లు), సాహో(రూ. 145.67 కోట్లు, బాహుబలిది బిగినింగ్' (రూ. 118.5 కోట్లు), పుష్ప: ది రైజ్ పార్ట్ I(రూ. 106.35 కోట్లు) చిత్రాలను దాటేసింది. ఈ జాబితాలో పుష్ప2 రూ. 812.14 కోట్ల వసూళ్లతో మొదటి స్థానంలో ఉంది. ఆ తర్వాత వరుసగా బాహుబలి2(రూ. 511 కోట్లు), కేజీఎఫ్ 2 రూ. 435.33 కోట్లు, కల్కి 2898 ఏడీ రూ. 293.13 కోట్లతో ఉన్నాయి. ఈ మూవీ అత్యధిక వసూళ్లు సాధించిన జాబితాలో ఎనిమిదో ప్లేస్‌లో నిలిచింది. దీపావళి సెలవులు రావడంతో ఈ వసూళ్లు మరింత పెరిగే ఛాన్స్ ఉంది. ఈ లెక్కన మరిన్ని రికార్డులు సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది. కాకగా.. ఈ సినిమాను 2022లో వచ్చిన కాంతార సినిమాకు ప్రీక్వెల్‌గా ప్రేక్షకుల ముందుకొచ్చారు. ఈ మూవీలో రుక్మిణి వసంత్, గుల్షన్ దేవయ్య, జయరామ్ కీలక పాత్రలు పోషించారు,

**హిందీలో అత్యధిక వసూళ్లు సాధించిన సౌత్ సినిమాలు..**

**పుష్ప -2: రూ. 812.14 కోట్లు**
**బాహుబలి- 2: రూ. 511 కోట్లు**
**కెజిఎఫ్- 2: రూ. 435.33 కోట్లు**
**కల్కి 2898 ఏడీ: రూ. 293.13 కోట్లు**
**ఆర్ఆర్ఆర్ : రూ. 272.78 కోట్లు**
**రోబో2: రూ 188.23 కోట్లు**
**మహావతార్ నరసింహ: రూ. 188.15 కోట్లు**
**కాంతార చాప్టర్-1: రూ. 155.5 కోట్లు**
**సలార్ - పార్ట్ I: రూ. 152.65 కోట్లు**
**సాహో : రూ. 145.67 కోట్లు**



## ఒక అపార్ట్‌మెంట్ అమ్మేసి రెండు ప్రాపర్టీస్ కొన్న సోనూసూద్

విలక్షణ నటుడు సోనూసూద్ ఫ్లాట్ కొనుగోలు చేశాడు. కుమారుడు ఇషాన్‌తో కలిసి ముంబై పన్వేల్‌లోని 777 చదరపు గజాల భూమిని తన సొంతం చేసుకున్నాడు. దీనికోసం రూ.1.09 కోట్లు ఖర్చుపెట్టినట్లు తెలుస్తోంది. రిజిస్ట్రేషన్ కోసం రూ.30 వేలు, స్టాంప్‌డ్యూటీ కింద రూ. 6.3 లక్షలు చెల్లించాడు. ముంబైపుణె మార్గంలో పన్వేల్ ప్రాంతం ఉంది. పన్వేల్‌లో ఐటీ సంస్థలు, విద్యా సంస్థలు, రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు రాబోతున్నాయి.

**ఇటీవలే అపార్ట్‌మెంట్ కొనుగోలు**

ముంబై రెండో అంతర్జాతీయ విమానాశ్రయం కూడా మరికొద్ది నెలల్లో ప్రారంభం కానుంది. కాగాసోనూసూద్ కుమారుడు ఇషాన్.. ఇటీవల ఆగస్టులో సైతం ముంబైలోని అంధేరి వెస్ట్‌లో ఓ అపార్ట్‌మెంట్ కొన్నాడు. దీనికోసం రూ. 2.6 కోట్లు ఖర్చు చేశాడు. అదే నెలలో సోనూసూద్.. ముంబైలోని మహాలక్ష్మి ప్రాంతంలో తన అపార్ట్‌మెంట్‌ను రూ.8.10 కోట్లకు అమ్మేశాడు. దీన్ని 2012లో రూ.5 కోట్లకు కొనుగోలు చేయగా దాదాపు 13 ఏళ్ల తర్వాత 8 కోట్లకు అమ్మేశాడు.

**సినిమా**

సినిమాల విషయానికి వస్తే.. సోనూసూద్ చివరగా ఫతే సినిమాలో నటించాడు. స్వీయదర్శకత్వంతో పాటు సోనూసూద్ హీరోగా, నిర్మాతగా వ్యవహరించిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద నిలదొక్కుకోలేకపోయింది. ఇతడు పుష్కరకాలం క్రితం నటించిన తమిళ మూవీ మదజగరాజ మాత్రం జనవరిలో రిలీజై సూపర్ హిట్ అందుకుంది.

# తొలి భారతీయ సెలబ్రిటీగా రికార్డ్

భాషతో సంబంధం లేకుండా ప్రేక్షకులను మెప్పిస్తుంటారు నటి దీపికా పదుకొణె. కేవలం తన నటనతోనే కాకుండా తన స్పీచ్‌లతోనూ అభిమానులను ఆకట్టుకుంటుంటారు. అందుకే ఆమెకు మరో అరుదైన గౌరవం దక్కింది. మెటా AIకి తన గొంతును అందించిన తొలి భారతీయ సెలబ్రిటీగా ఆమె నిలిచింది. తాను ఇప్పుడు మెటా ఏఐలో భాగమైనట్లు ఒక వీడియోతో సోషల్‌మీడియాలో పంచుకున్నారు. ఆమెకు మరోసారి అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు దక్కింది. మెటా ఇటీవల ప్రత్యేక ఏఐ చాట్‌బాట్ యాప్‌ను ఆవిష్కరించిన విషయం తెలిసిందే. వివిధ రకాల టెక్స్ట్, ఇమేజ్, వీడియో డేటాతో శిక్షణ ఇవ్వడం వల్ల మీరు అడిగే ప్రశ్నను కూడా విస్తృత స్థాయిలో అర్థం చేసుకుంటుంది. మీతో చాటింగ్ చేయడమే కాకుండా వాయిస్‌తో సలహాలు, కబుర్లు కూడా చెబుతుంది. మీకు కావాల్సింది ప్రాంప్ట్‌లను అందిస్తే చాలు మాట్లాడేస్తుంది. ఏదైనా అంశం మీద లోతుగా తెలుసుకోవాలనుకుంటే విశ్లేషణ కూడా చేస్తుంది. ఇప్పుడు ఇవ్వన్ని మీ అభిమాన నటి దీపికా పదుకొనె వాయిస్‌తో మీరు వినేయవచ్చు. ఆమెతో ఎప్పుడైనా మాట్లాడవచ్చు. కానీ, ఆమె వాయిస్ మాత్రం ఏఐ ఆధారంగా మాత్రమే మీకు అందుబాటులో ఉంటుంది. వాయిస్ ఇన్‌పుట్స్‌తో మెటా ఏఐ అసిస్టెంట్ పనిచేస్తుంది. ఇప్పుడు దానికి దీపికా పదుకొణె వాయిస్ తోడవుతుంది. అంటే స్నేహితుడితో మాట్లాడినట్టుగా ఎప్పుడైనా దీపికతో మాట్లాడొచ్చన్నమాట. మెటా ఏఐలో హాలీవుడ్ నుంచి కొంతమంది ప్రముఖుల వాయిస్‌లు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. కానీ, ఇండియా నుంచి మాత్రం కేవలం దీపికా పదుకొనె వాయిస్ మాత్రమే అందుబాటులోకి రానుంది. ఈ క్రమంలోనే దీపిక ఒక వీడియోను షేర్ చేసుకున్నారు. ఇది చాలా బాగుంది అని తాను అనుకుంటున్నట్లు పేర్కంది. తాను ఇప్పుడు మెటా AIలో భాగమయ్యానని దీంతో భారతదేశం, యునైటెడ్ స్టేట్స్, కెనడా, యునైటెడ్ కింగ్‌డమ్, ఆస్ట్రేలియా , న్యూజిలాండ్ అంతటా తన వాయిస్‌తో ఇంగ్లీషులో చాట్ చేయవచ్చని ఆమె పంచుకున్నారు. ఒక్కసారి దీనిని ప్రయత్నించి ఏమనుకుంటున్నారో తెలియజేయాలని ఆమె కోరారు.



# కొచ్చాడియాన్ కేసులో లతా రజనీకాంత్ పిటిషన్ కొట్టివేత



తమిళ స్టార్ హీరో రజనీకాంత్ సతీమణి లతా రజనీకాంత్‌పై చీటింగ్ కేసు ఉన్న విషయం తెలిసిందే. 2015లో తమ కుమార్తె ఐశ్వర్య తెరకెక్కించిన కొచ్చాడియాన్ సినిమా ప్రొడక్షన్ టైంలో ఓ యాడ్ ఏజెన్సీ కంపెనీ నుంచి తీసుకున్న ఋణం తిరిగి ఇవ్వకపోవడంతో లతా రజనీకాంత్‌పై చీటింగ్ కేసు నమోదైంది. ఆమె ష్యూరిటీ సంతకం పెట్టడం వల్లే ఈ చిక్కులు వచ్చాయని సమాచారం. అయితే, ఈ కేసులో ఆమెకు బెయిల్ లభించింది. కానీ, తనకు ఈ కేసుతో ఎలాంటి సంబంధం లేదంటూ బెంగళూరు కోర్టులో లత పిటిషన్ దాఖలు చేశారు. విచారించిన న్యాయస్థానం దానిని తిరస్కరించింది. 2014లో విడుదలైన 'కొచ్చాడియాన్' చిత్రానికి సంబంధించిన ఫోర్జరీ కేసులో తన పేరును తొలగించాలని కోరుతూ లత రజనీకాంత్ చేసిన దరఖాస్తును బెంగళూరు కోర్టు కొట్టివేసింది. తనపై వచ్చిన ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని ఆమె పేర్కొంది. అయితే, 48వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ నిందితులపై విచారణ జరిపేందుకు తగిన ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఆమె దరఖాస్తును కొట్టివేశారు. 2015లో, చెన్నైకి చెందిన యాడ్ బ్యూరో అడ్వర్టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ పేరుతో లత నకిలీ పత్రాలను ఉపయోగించి కోర్టును కూడా మోసం చేశారని ఒకరు పిటిషన్ వేశారు. తప్పుడు పత్రాలతో ఆమె మీడియా గ్యాగ్ ఆర్డర్ పొందారని పిటిషన్ దాఖలైంది. ఈ ఆర్డర్‌తో ఆమెపై వచ్చిన పలు మీడియా కథనాలు తొలగించారని అందులో పేర్కొన్నారు. కొచ్చాడియాన్‌తో సంబంధం ఉన్న ఆర్థిక వివాదాలకు సంబంధించిన దాదాపు 70 మీడియా సంస్థలకు చెందిన వార్తలు తొలగించారని తెలిపారు.

# కృతిశెట్టి ఎదురుచూపులు

## ఇప్పుడా టైమ్ వచ్చింది



కొందరి హీరోయిన్లకు అందం, అభినయం ఉన్నా సరే ఒక్కోసారి విజయాలు అందని ద్రాక్షే అవుతంది. నటి కృతిశెట్టి (Krithi Shetty) పరిస్థితి ఇప్పుడు అలానే ఉంది. ఉప్పెన చిత్రంతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చిన ఈ కన్నడ బ్యూటీ.. తొలి సినిమా తర్వాత వరుసగా విజయాలు దక్కాయి. దీంతో టాలీవుడ్‌లో దూసుకుపోతారనే ప్రచారం జరిగింది. అంతే ఆ తరువాత కృతిశెట్టి నటించిన చిత్రాలు పరాజయం పాలవడం మొదలెట్టాయి. అయితే ఆ తరువాత కోలీవుడ్‌పై దృష్టి సారించారు. అంతకుముందే తెలుగు, తమిళం భాషల్లో నటించిన ద్విభాషా చిత్రాలు ది వారియర్, కస్టడీ చిత్రాలు పూర్తిగా నిరాశపరచాయి. అయినప్పటికీ అమ్మడికి తమిళంలో అవకాశాలు వరించాయి. అయితే అక్కడ ఈ బ్యూటీ నటించిన చిత్రాలు ఏళ్ల తరబడి నిర్మాణంలో ఉండడం గమనార్హం. తమిళంలో కృతిశెట్టి నటించిన మూడు చిత్రాలు ఇప్పుడు ఒకే నెలలో తెరపైకి రావడానికి సిద్ధం అవుతుండడం విశేషం. వీటిలో ఏ ఒక్కటి విజయం సాధించినా కృతిశెట్టి కెరీర్‌కు హెల్ప్ అవుతుంది. దీంతో అలాంటి విజయం కోసం ఈ అమ్మడు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారనే చెప్పాలి. కార్తీకి జంటగా నటిస్తున్న వా వాద్దియార్ చిత్రం డిసెంబర్ 5న తెరపైకి రానుంది. తర్వాత ప్రదీప్ రంగనాథన్‌కు జంటగా లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ చిత్రంలో నటిస్తున్నారు. నిజానికి ఈ చిత్రం ఈ దీపావళికి విడుదల కావలసింది. ప్రదీప్ రంగనాథన్ నటించిన డ్యూడ్ దీపావళికి తెరపైకి రానుండడంతో లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ డిసెంబర్‌కు వాయిదా పడింది. ఇకపోతే కృతి నటిస్తున్న మరో చిత్రం జీవీ. రవిమోహన్ నాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రాన్ని వేల్స్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై ఐసరి కే.గణేశ్ నిర్మిస్తున్నారు. ఇందులో మరో నాయకిగా కల్యాణి ప్రియదర్శన్ నటిస్తున్నారు. వీటిలో నటి కృతిశెట్టి దశను మార్చే చిత్రం ఏది అవుతుందో చూడాలి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com